
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కృష్ణా జిల్లా వార్తలు

మంగళవారం 5 ఆగస్టు 2025

గాడి తప్పిన పాలన!

డీఆర్‌డీఏ పీడీ సీసీ కనుసన్నల్లోనే జిల్లా కార్యాలయం

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) కార్యాలయంలో పాలన గాడి తప్పింది. కొంతకాలంగా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌కు, డివిజన్ స్థాయి ప్రాజెక్టు అధికారులు, మండల ప్రాజెక్టు అధికారులకు పరిపాలనాపరమైన అంశాల్లో పొసగడం లేదు. దీంతో పాటు మండల, జిల్లా సమాఖ్య నిధులను ఇబ్బడిముబ్బడిగా ఖర్చు చేయాలని ఒత్తిడి తెస్తుండటంతో అధికారులు కొందరు పీడీకి ఎదురు తిరుగుతున్నారు. ఈ క్రమంలో డీఆర్‌డీఏ కార్యాలయంలో హెచ్‌ఆర్ విభాగం డీపీఎంగా వివాదాస్పద అధికారిని నియమించడంతో ఈ వివాదాలు మరింత తీవ్రమయ్యాయని విమర్శలు వినిపిస్తున్నాయి.

6

‘అమరావతి పునర్నిర్మాణ’ బిల్లుల చెల్లింపులో జాప్యం

ఏపీఎంల బదిలీల్లోనూ ఇష్టారాజ్యం ● డీఆర్‌డీఏ పీడీ తీరుపై కలెక్టర్ సీరియస్

ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం : రాజధాని అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఈ ఏడాది మే 2వ తేదీన వచ్చారు. ఈ కార్యక్రమానికి జనసమీకరణ చేయడంతోపాటు, వారికి భోజన వసతులు కల్పించే బాధ్యతను, ఇతరత్రా ఖర్చులను డీఆర్‌డీఏ విభాగమే చూస్తుందని అడిగి మరీ తీసుకున్నారు. భోజన వసతికి సంబంధించి వ్యవహారం పౌరసరఫరాలశాఖ అధికారులు చూడాల్సి ఉండగా, డీఆర్‌డీఏ పీడీ తనకు ఈ పనిని అప్పగించాలని కోరి మరీ తీసుకున్నట్లు ఆ శాఖ అధికారులు చెప్పుకుంటున్నారు. ఇందుకు అయ్యే ఖర్చులను మండల సమాఖ్య నిధుల నుంచి ఖర్చు చేసి, ఆ తర్వాత బిల్లులు చేసుకోవాలని పీడీ టెలీ కాన్ఫరెన్స్‌లో చెప్పడంతో మండల స్థాయిలో ఏపీఎంలు ఖర్చు పెట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన ఖర్చులను మండల, జిల్లా సమాఖ్య నుంచి ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో ఈ శాఖకు సంబంధించి ఆర్థిక విభాగంలో పనిచేసే అధికారులు, సిబ్బంది ఈ బిల్లుల్లో తేడా ఉందని, మండల, జిల్లా సమాఖ్యల నుంచి నగదు ఇచ్చేది లేదని తేల్చి చెప్పినట్టు సమాచారం. గన్నవరం, పెనమలూరు మండలాల్లో పెద్దమొత్తంలో బిల్లులు పెట్టడం, ఈ లెక్కల ప్రకారం నగదు ఇస్తే భవిష్యత్‌లో ఆడిట్ అభ్యంతరాలు ఎదురవుతాయని వారు చెప్పినట్లు తెలిసింది. జిల్లాలోని 25 మండలాల్లో రూ.70 లక్షల వరకు బిల్లులు ఇంకా పెండింగ్‌లో ఉండటంతో ఏపీఎంలు తమకు బిల్లులు ఇప్పించాలని కోరుతూ కలెక్టర్‌ను కలిసేందుకు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. దీంతో కలెక్టర్‌కు ఇచ్చేందుకు ఏపీఎంలు తయారు చేసిన లెక్కలకు సంబంధించిన పత్రాలను డీఆర్‌డీఏ పీడీ తీసుకుని, ఈ విషయంపై తాను కలెక్టర్‌తో మాట్లాడుతానని వారిని తిప్పి పంపేశారు. ఇప్పటికే ఈ బిల్లుల చెల్లింపు అంశంలో డీఆర్‌డీఏ పీడీ సక్రమంగా వ్యవహరించకపోవడంతో కలెక్టర్ సీరియస్ అయినట్లు మిగతా 6లో..



ఒక సీసీ బదిలీ కోసం అనేక సార్లు ఉత్తర్వులు

అవనిగడ్డ నియోజకవర్గంలో పనిచేసే కమ్యూనిటీ కోఆర్డినేటర్(సీసీ)కు పోస్టింగ్ ఇచ్చేందుకు గత నాలుగైదు నెలల్లో ఏడెనిమిది సార్లు ఉత్తర్వులు జారీ చేసిన విషయం వెలుగులోకి రావడంతో ఈ అంశం చర్చనీయాంశమైంది. ఈ సీసీని మోపిదేవి, చల్లపల్లి, కోడూరు తదితర మండలాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం, ఆ మండలాల ప్రజాప్రతినిధులు, అధికారులు మా మండలంలో ఈ సీసీ పనిచేయడానికి వీల్లేదని పట్టుబట్టడం, మళ్లీ వేరే మండలానికి ఈ సీసీని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరుగుతూ వస్తోంది.

జిల్లా సమైక్య అధ్యక్షురాలి పదవీ కాలం ముగిసినా..

వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లా సమైక్య అధ్యక్షురాలిని నియమించారు. 2024 ఏప్రిల్‌లో ఆమె పదవీకాలం ముగిసింది. అయినా ఆమెనే ఈ పదవిలో కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది కాలంలో ఇన్‌చార్జి పీడీలు ముగ్గురు మారారు. మార్చి నుంచి రెగ్యులర్ పీడీ వచ్చినా జిల్లా సమైక్య అధ్యక్షురాలిని మార్చకుండా జాప్యం చేయడం వెనుక కారణాలు ఏమై ఉంటాయనే అంశంపైనా చర్చ జరుగుతోంది.

భర్త వేధింపులు తాళలేక వధువు ఆత్మహత్య

ఉయ్యూరులో విషాద ఘటన

- భర్త, అత్తమామలను వదలొద్దు
- లేఖ రాసి తనువుచాలించిన యువ అధ్యాపకురాలు



భర్త అరుణ్‌కుమార్‌తో శ్రీవిద్య(ఫైల్)

ఉయ్యూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కోటి ఆశలతో మెట్టినింట అడుగు పెట్టిన వధువుకు అనుక్షణం అవమానాలే ఎదురయ్యాయి. ప్రభుత్వ ఉద్యోగి అయిన భర్త విచక్షణ మరచి నువ్వు అందంగా లేవు, నాకు పరిచయం ఉన్న అమ్మాయి అందం ముందు నీవెందుకు పనికిరావు అంటూ కొట్టి దూషించడం, అడ్డు చెప్పాల్సిన అత్తామామ అతనికి అండగా నిలబడటం చూసి తట్టుకోలేకపోయింది. పెళ్లైన నాలుగు నెలలకే మెట్టినింటి వేధింపులు తాళలేక.. పుట్టింటికి వెళ్లలేక పదిమందికి మంచీచెడు చెప్పే యువ అధ్యాపకురాలు బలవన్మరణానికి పాల్పడింది. తన చావుకు కారణమైన వారిని వదలొద్దు అంటూ తల్లిదండ్రులకు లేఖ రాసింది. ఈ హృదయ విదారక ఘటన ఉయ్యూరులో ఆదివారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే... కలవపాముల గ్రామ సచివాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న అరుణ్‌కుమార్‌కు ఉయ్యూరు అంబేడ్కర్ నగర్‌కు చెందిన వర్రే శ్రీవిద్య (24)తో నాలుగు నెలల క్రితం వివాహం జరిగింది. ఎంఎస్సీ చదివిన శ్రీవిద్య స్థానిక శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తోంది. ఆదివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తన చావుకు భర్త, అత్తమామలే కారణమని తన తల్లిదండ్రులు, తమ్ముడికి లేఖ రాసింది. భర్త మిగతా 6లో..



ఆదర్శ నేత మండలి

విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం జరిగిన దివిసీమ గాంధీ, మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు శతజయంతి వేడుకలకు హాజరై ఆయన విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు, మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, బొండా ఉమా, యార్లగడ్డ వెంకట్రావు, శ్రీరాం తాతయ్య తదితరులు

6

దుర్గగుడి హుండీ ఆదాయం రూ.3.34 కోట్లు



బంగారం, వెండి, వివిధ దేశాల కరెన్సీ కూడా.. ▸▸ 19 రోజుల కానుకల లెక్కింపు

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో గత 19 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకలను ఈవో శీనానాయక్ పర్యవేక్షణలో సోమవారం లెక్కించారు. నగదు రూ.3,34,70,370, బంగారం 265 గ్రాములు, వెండి 7 కిలోల 110 గ్రాములు వచ్చింది. 2000 నోట్లు ఏడు, 707 యూఎస్ఏ డాలర్లు, 130 ఇంగ్లాండ్ పౌండ్లు, 60 సింగపూర్ డాలర్లు, 255 ఆస్ట్రేలియా డాలర్లు, 210 యూఏఈ దిర్హమ్‌లు, 11 సౌదీ రియాల్స్, 400 ఓమన్ బయసాస్, 340 నేపాల్ రూపాయలు, 12,010 మలేషియా రింగెట్లు, 30 యూరోలు, 13.1/3 కువైట్ దీనార్లు, ఒక ఒమన్ రియాల్, 100 కెనడా డాలర్లు లభించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పదేపదే ఉల్లంఘిస్తే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు!

ట్రాఫిక్ ఉల్లంఘనులకు పోలీసుల ఝలక్

- ఎనిమిది మంది డీఎల్ రద్దుకు రవాణా శాఖకు సిఫార్సు
- భవిష్యత్తులో మరింతమంది లైసెన్స్‌లకు తప్పని ముప్పు

విజయవాడ నగరానికి చెందిన ఓ వ్యక్తి తన ద్విచక్ర వాహనాన్ని లైసెన్స్ లేకపోయినా కుమారుడికి ఎక్కువగా ఇస్తున్నాడు. ట్రాఫిక్ పోలీసులు మూడు సార్లు ఈ వాహనంపై చలాన విధించారు. తండ్రిని పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా ఆ అబ్బాయి ద్విచక్ర వాహనంపై పోలీసులకు పట్టుబడుతూనే ఉన్నాడు. దీంతో తండ్రి లైసెన్స్‌ను రద్దు చేయాలని ట్రాఫిక్ పోలీసులు రవాణా శాఖ అధికారులకు ఇటీవల ప్రతిపాదనలు పంపారు. ఇలా పదేపదే నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఎనిమిది మంది డ్రైవింగ్ లైసెన్స్‌ల రద్దుకు సిఫార్సు చేశారు. ఈ సంఖ్య భవిష్యత్తులో మరింత పెరగనుంది.



నిబంధనలు పాటించని వారికి చలానాలు విధిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): విజయవాడలో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి పోలీసులు విధిస్తున్న జరిమానాలను కొంతమంది వాహనదారులు తేలిగ్గా తీసుకుంటున్నారు. జరిమానాలు ఎన్నైనా చెల్లిస్తాం... ట్రాఫిక్ నిబంధనలను మాత్రం పాటించలేం అన్నట్టు వ్యవహరిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలకు సంబంధించి పోలీసులు నిత్యం నగరంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహిస్తున్నారు. హెల్మెట్, డ్రంక్ అండ్ డ్రైవ్, రెడ్‌సిగ్నల్ జంపింగ్, డ్రైవింగ్ లేకుండా వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తున్నారు. ఇది కాకుండా ధ్వని కాలుష్యానికి కారణమవుతున్న అధిక శబ్దం చేసే సైలెన్సర్లను అమర్చుకుంటున్న వాహనాలకు జరిమానాలు వేస్తున్నారు. అయినా తీరు మారకపోవడంతో డ్రైవింగ్ లైసెన్స్ రద్దుతో సమాధానం చెప్పాలని ట్రాఫిక్ పోలీసులు నిర్ణయించారు.

వేలల్లో ఉల్లంఘనలు

విజయవాడ రహదారులపై మూడు రకాల ఉల్లంఘనలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఒక విధానం లేకుండా రహదారులపై వాహనాలను నడుపుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. పక్క వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తూ వేగంగా ముందుకు దూసుకుపోతున్నారు. యువకులు స్నేక్ డ్రైవింగ్‌తో భయపెడుతున్నారు. వెనుక వైపు అమ్మాయిలు కూర్చుంటే మేఘాల్లో తేలుతున్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఈ ర్యాష్ డ్రైవింగ్‌కు సంబంధించి ట్రాఫిక్ పోలీసులు ఈ ఏడాది ఇప్పటి వరకు 16,521 కేసులను నమోదు చేశారు. ఆ తర్వాత స్థానంలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న కేసులు ఉన్నాయి. ఇప్పటి వరకు 12,223 నో డీఎల్ కేసులు నమోదు చేశారు. మూడో స్థానంలో సైలెన్సర్ కేసులు ఉన్నాయి. షోరూంల నుంచి కొనుగోలు చేసిన వాహనాలకు తయారీలో అమర్చిన సైలెన్సర్లను పీకేస్తున్నారు. వాటి స్థానంలో అధిక శబ్దం చేసే సైలెన్సర్లను అమర్చుకుంటున్నారు. ప్రధాన ఈ అమరిక బుల్లెట్లకు జోరుగా సాగుతోంది. రహదారులపై ఎవరి మార్గంలో వారు వెళ్తున్నప్పుడు ఆకతాయిలు బుల్లెట్లుపై వెళ్తూ పవర్ స్విచ్‌ను ఆఫ్‌చేసి ఆన్ చేస్తున్నారు. దీంతో ఒక్కసారిగా బాంబు పేలిన శబ్దం వస్తోంది. అప్పటి వరకు ఆదమరుపుగా ఉన్న పాదచారులు, వాహనదారులకు ఒక్కసారిగా గుండె జల్లుమంటోంది. ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌లో ఇటీవల డీజీపీ సమక్షంలో 500 బుల్లెట్లకు సంబంధించి సైలెన్సర్లను రోడ్డు రోలర్‌తో తొక్కించారు. ఈ మూడు ఉల్లంఘనలతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పోలీసులకు కొంతమంది వాహనదారులు పదేపదే పట్టుబడుతున్నారు. జరిమానాలు చెల్లించేసి చేతులు దులుపుకుంటున్న ఉల్లంఘనులకు డ్రైవింగ్ లైసెన్స్ రద్దుతో గుణపాఠం చెప్పాలని ట్రాఫిక్ పోలీసులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఎనిమిది మంది వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దు చేయాలని రవాణా శాఖ అధికారులకు ప్రతిపాదనలు పంపారు. త్వరలో మరికొంతమంది లైసెన్స్‌లను రద్దు చేయాలని ప్రతిపాదించనున్నట్టు ట్రాఫిక్ విభాగ వర్గాలు తెలిపాయి.

ఏసీబీకి చిక్కిన డ్రైనేజీ శాఖ జూనియర్ అసిస్టెంట్

- కాంట్రాక్టర్‌కు ఎం.బుక్ ఇచ్చేందుకు రూ.30 వేలు డిమాండ్
- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ డీఎస్పీ



ఏసీబీ అధికారులకు పట్టుబడిన శ్రీనివాసరావు

గుడివాడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గుడివాడలోని డ్రైనేజీశాఖ ఈఈ కార్యాలయంపై ఏసీబీ అధికారులు సోమవారం దాడి చేశారు. కాంట్రాక్టర్ నుంచి రూ.30 వేలు లంచం తీసుకుంటున్న జూనియర్ అసిస్టెంట్ గరికిపాటి శ్రీనివాసరావును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే... బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన కాంట్రాక్టర్ తురకా రాజా వర్క్ డిపాజిట్ ఎం.బుక్ ఇవ్వాలని డ్రైనేజీశాఖ అధికారులను కోరారు. దీనికి గుడివాడలోని డ్రైనేజీ ఈఈ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న మిగతా 6లో..



ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్న వేళ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో రుణాలు అందక రైతులు అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో 425 సంఘాలుంటే 117 సంఘాలకే ప్రభుత్వం త్రిసభ్య కమిటీలను నియమించింది. మిగిలిన చోట్ల పాలకవర్గాలు, త్రిసభ్య కమిటీలు లేక పర్సన్ ఇన్‌చార్జి(పీఐసీ)తో నడుస్తున్నాయి. ఆయా సంఘాల్లో రుణాల మంజూరులో జాప్యం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే అన్ని సంఘాలకు త్రిసభ్య కమిటీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



అన్నదాతల రుణ అవస్థలు!

పాలకవర్గాలకు నోచుకోని పీఏసీఎస్‌లు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం సంఘాలు 425

- 117 సంఘాలకే త్రిసభ్య కమిటీల నియామకం
- మిగిలిన చోట్ల పర్సన్ ఇన్‌చార్జులతో నెట్టుకొస్తున్న ప్రభుత్వం
- ఖరీఫ్ వేళ రుణాలు అందడంలేదని రైతుల ఆందోళన
- పూర్తిస్థాయిలో అన్ని సంఘాలకు త్రిసభ్య కమిటీలను వేయాలని డిమాండ్

(కంచికచర్ల-ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులకు విరివిగా రుణాలు అందిస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్)కు పాలకవర్గాలు లేవు. త్రిసభ్య కమిటీలతో సొసైటీలను పాలకులు నడిపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిపైగా అయినప్పటికీ పీఏసీఎస్‌లకు ఇంకా పూర్తిస్థాయిలో త్రిసభ్య కమిటీలను నియమించలేదు. గత నెలలో రెండు దఫాలుగా కొన్ని సంఘాలకు మాత్రం త్రిసభ్య కమిటీలను నియమించారు. ఎందువల్లనో మిగతా సంఘాలకు కమిటీలను వేయలేదు. పర్సన్ ఇన్‌చార్జి (పీఐసీ) ఆధ్వర్యంలో సంఘాలు నడుస్తున్నాయి. అయితే కమిటీలు లేకపోవటం వల్ల రైతులకు సకాలంలో రుణాలు అందటం లేదని అంటున్నారు. సంవత్సర కాలంగా అధికారుల పర్యవేక్షణలో రైతులకు రుణాలు మిగతా 6లో..

స్వాతంత్ర్య దినోత్సవానికి ఏర్పాట్లు చేయండి

● ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ 6

జవహర్ నవోదయ 6వ తరగతి ప్రవేశానికి గడువు పెంపు

8

29న జాతీయ క్రీడా దినోత్సవం

6



ఈవోకు వెండి వస్తువులు అందజేస్తున్న దాతలు

దుర్గమ్మ సన్నిధిలో దాతల విరాళాలు

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మకు వివిధ రూపాల్లో వివిధ పథకాలకు విరాళాలు, కానుకలను సోమవారం పలువురు భక్తులు అందజేశారు. ప్రముఖ మృదంగ విద్వాంసుడు పద్మశ్రీ యల్లా వెంకటేశ్వరరావు రెండు వెండి దీపపు కుందులు, పళ్లెం, చెంబును కానుకగా



దాతలకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఈవో

సమర్పించారు. ఉచిత ప్రసాద వితరణకు హైదరాబాద్ అమీర్‌పేటకు చెందిన బి.నారాయణస్వామి నాయుడు, లక్ష్మీపున్నమ్మ దంపతులు మనవడు గోపాలకృష్ణ, మనవడి భార్య గిరిజ కుమార్ పేరిట రూ.1.50లక్షలు విరాళంగా అందజేశారు. అన్నప్రసాద వితరణకు తిరుపతి శాంతినగర్, లక్ష్మీనిలయానికి చెందిన సీఎంఆర్ ఇన్‌ఫ్రాటెక్ ఎండీ సి.నాగేశ్వరరావు రూ.5లక్షలు విరాళంగా అందజేశారు. ఈవో శీనానాయక్ దాతలకు ఆలయ లాంఛనాలను అందజేశారు.

ఘాట్ రోడ్డులో ప్రసాదాల కౌంటర్ ప్రారంభం

ఇంద్రకీలాద్రి : భక్తుల సౌకర్యార్థం దుర్గగుడి ఘాట్ రోడ్డు మొదట్లో ఉన్న కామధేను అమ్మవారి మందిరం పక్కన ప్రసాదాలు, వాహనపూజ టిక్కెట్లు, కొబ్బరికాయల విక్రయాలకు కొత్తగా కౌంటర్‌ను ప్రారంభించారు. సోమవారం ఈవో శీనానాయక్ ప్రత్యేక పూజల అనంతరం కౌంటర్‌కు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఈవో శీనానాయక్ మాట్లాడుతూ, మెరుగైన సౌకర్యాలను భక్తులు సద్వినియోగ పరచుకోవాలన్నారు. కొత్త కౌంటర్‌లో ప్రసాదాల విక్రయాలతో పాటు నియంత్రించిన ధరలతో కొబ్బరికాయల విక్రయాలు జరుగుతాయన్నారు. ఇదే కౌంటర్‌లో వాహనపూజల టిక్కెట్లను కూడా పొందవచ్చునని, ఆయా కౌంటర్ల దగ్గర భక్తులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా కొత్త కౌంటర్ ద్వారా కొబ్బరికాయలు, ప్రసాదాలను కొనుగోలు చేయవచ్చునని తెలిపారు.

దసరాకు దర్శనం టిక్కెట్ ధర పెంచలేదు

» ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో దసరా మహోత్సవాల సందర్భంగా దర్శనాల టిక్కెట్ ధర పెంచారంటూ సోషల్‌మీడియాలో అవాస్తవాలను ప్రచారం చేయటం సరికాదని ఈవో వీకే శీనానాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దసరా మహోత్సవాలలో దుర్గమ్మ దర్శనం టిక్కెట్ ధర రూ.1000 నిర్ణయించారనటం వాస్తవం కాదన్నారు. అనధికార దర్శనాల కట్టడి, సామాన్య భక్తుల దర్శనాలకే తొలి ప్రాధాన్యంపై ఇటీవల సమన్వయ సమావేశంలో చర్చ జరిగిందన్నారు. కుంకుమార్చన విషయంలో గతేడాది ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై సమావేశంలో చర్చించామన్నారు. అర్చకస్వాములు, సిబ్బంది అభిప్రాయాలను తెలుసుకుని ఆ మేరకు చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. అసత్యప్రచారాలను నమ్మవద్దని భక్తులకు సూచించారు.



గంగానమ్మ తల్లి ప్రతిష్ఠ ఉత్సవాల్లో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కోలాహలంగా గంగానమ్మ ఆలయ ప్రతిష్ఠ

ముదినేపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం గురజ గ్రామంలో పునర్నిర్మించిన గంగానమ్మ ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. పండితుల వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు, పంబలోళ్ల ఆచార సంప్రదాయాల మధ్య ఆలయంలో గంగానమ్మ, నాగబంధం, పోతురాజుస్వామి, సింహవాహన విగ్రహాలు, ఆలయ శిఖర ప్రతిష్ఠ జరిగింది. ఉదయం 8.13 గంటలకు విగ్రహాలను ప్రతిష్ఠించి, మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులను తీర్చుకున్నారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌తోపాటు మండల టీడీపీ అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, కొత్త నాగేంద్ర కుమార్, బొర్రా చలమయ్య, కూటమి నేతలు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యెర్నేని వెంకట సుబ్బారావు, కోశాధికారి జాస్తి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో అన్నసమారాధన నిర్వహించారు.

కేంద్ర విశ్వవిద్యాలయాలకు రూ. 529.14 కోట్లు

» ఎంపీ కేశినేని చిన్ని ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానం

వన్‌టౌన్ : ఏపీలోని కేంద్ర విశ్వవిద్యాలయాలకు 2019-2024 మధ్య రూ. 529.14 కోట్ల నిధులను విడుదల చేసినట్టు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుకాంత మజుందార్ వెల్లడించారు. 2020-2021, 2024-2025 వరకుఏపీలోని కేంద్ర విశ్వవిద్యాలయానికి రూ. 404.05 కోట్లు విడుదల చేయగా, కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయానికి రూ 125.09 కోట్లు విడుదల చేసినట్టు మంత్రి వివరించారు. గిరిజన విశ్వవిద్యాలయంలో 18మంది అధ్యాపకులు, 12 మంది బోధనేతర సిబ్బంది పూర్తి స్థాయిలో పనిచేస్తున్నారని, కేంద్ర విశ్వవిద్యాలయంలో ఒక అధ్యాపకుడు, బోధనేతర సిబ్బంది మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషనకు బ్లాక్ గ్రాంట్ రూపంలో నిధులు విడుదలవుతాయని, యూజీసీ నుంచి ఆయా విశ్వవిద్యాలయాల అవసరాలమేరకు నిధులు కేటాయిస్తారని వివరించారు.

ఎన్టీటీపీఎస్ ఆసుపత్రి ప్రయివేటు పరం!

» తీవ్రంగా వ్యతిరేకిస్తున్న కార్మిక సంఘాలు

» అవసరమైతే ధర్నాకు సిద్ధం

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీటీపీఎస్ యాజమాన్యం తీరుతో కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. ఇప్పటికే కారుచౌకగా యాష్ పాండ్‌లోని బూడిదను ప్రయివేటు వ్యక్తుల పరం చేసిన యాజమాన్యం తాజాగా ఎన్టీటీపీఎస్ ఆసుపత్రిని ధారాదత్తం చేసేందుకు సిద్ధపడుతోంది. ఇందుకు సంబంధించిన జీవో సైతం విడుదల చేసినట్టు కార్మిక సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో విలువైన అధునాతన వైద్య పరికరాలు ఉన్న వైద్యశాల ప్రయివేటుపరం చేయడం ఏమిటని కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రయివేటు అప్పగిస్తే ఉద్యోగులు, కార్మికులకు మెరుగైన వైద్య సేవలు దూరమవుతాయని ఆందోళన చెందుతున్నారు. యాజమాన్యం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు.

ఆదర్శ నేత మండలి

ఘనంగా మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాలు



తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 'మండలి' చిత్ర ప్రదర్శనను తిలకిస్తున్న సీఎం చంద్రబాబు, బుద్ధప్రసాద్



అవనిగడ్డలోని గాంధీక్షేత్రంలో మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న రఘురామ కృష్ణరాజు, కొనకళ్ల నారాయణ, ఆలపాటి రాజేంద్రప్రసాద్, వసంత నాగేశ్వరరావు, నన్నపనేని, బుద్ధప్రసాద్ ప్రభృతులు

విజయవాడ/అవనిగడ్డ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజాజీవితం కోసం సేవే పరమావధిగా నిత్యం పరితపించిన మండలి వెంకట కృష్ణారావు చిరస్మరణీయులని వక్తలు కొనియాడారు. మండలి వెంకట కృష్ణారావు శతజయంతి వేడుకలు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అవనిగడ్డలో సోమవారం జరిగాయి. కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, ప్రెస్ అకాడమి చైర్మన్ ఆలపాటి సురేష్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, మాజీమేయర్ జంధ్యాల శంకర్, మండలి వెంకటకృష్ణారావు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

175 నియోజకవర్గాల్లో అవతరించాలి

- గరికపాటి నరసింహారావు

ఆదర్శాలను ఆరాధించకుండా ఆచరించారు. మండలి వెంకట కృష్ణారావు ఒక వసుధ. ఏకగ్రీవంగా ఎన్నికున్న ప్రజలకు దివిసీమకు ఉప్పెన వచ్చినప్పుడు ఏమి చేయాలో అంతా చేశారు. మండలి వంటి త్యాగమూర్తులు రాష్ట్రంలో 175 మంది అవతరలించాలి. కృష్ణారావు ఉన్న ఆస్తులను కరిగించుకున్నారు. త్యాగం వల్లే అమృతానందం కలుగుతుంది. కృష్ణారావు అదే చేశారు. ఆయన భాషాభిమానే కాదు పండితుడు. గురువు దినం పదాన్ని గురుపూజా మహోత్సవంగా కృష్ణారావు మార్చారు. ఆయన ఆదర్శాలను స్వీకరించాలి.

సనాతనధర్మాన్ని పాటించిన వ్యక్తి

- విశ్వంజీ, విశ్వయోగి

ప్రపంచమంతా అస్తవ్యస్తంగా ఉంది. మండలి వెంకట కృష్ణారావు నాస్తికుడు కాదు. సనాతనధర్మాన్ని పాటించారు. సనాతనధర్మం భౌతికాన్ని గురించి ఎక్కువగా ఆలోచించింది. మండలి వెంకట కృష్ణారావు ప్రజలు, ప్రకృతి గురించి ఆలోచించారు. ప్రకృతి వైపరీత్యాలు రాకుండా ఏంచేయాలో ఆలోచించారు. డబ్బులు పాపిష్టుల చేతుల్లోకి వెళ్తే పాపాలు చేస్తుంది. అదే మంచి వాళ్ల చేతిలోకి వెళ్తే మంచి చేస్తుంది. రాష్ట్రంలో ఒక ప్రాజెక్టుకు మండలి వెంకటకృష్ణారావు పేరు పెట్టాలని చంద్రబాబును కోరాను. దానికి ఆయన అంగీకరించారు.

జాతికి మేలు చేసిన వారిని స్మరించుకోవాలి

- బొండా ఉమా, సెంట్రల్ ఎమ్మెల్యే

ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా కృష్ణారావు నిబద్ధత కలిగిన జీవితం గడిపారు. ఆయన జీవితం మాకు ఆదర్శనీయం. జాతికి మేలు చేసిన వారిని గుర్తించుకోవాలి. వారి గురించి రాబోయే తరాలకు తెలియజేయాలి. దివిసీమ గాంధీగా కృష్ణారావు నిలిచారు. ఆయన ఎప్పుడూ ప్రజల పక్షాన, తెలుగు భాష పక్షాన నిలబడ్డారు.

'పద్మా'లకు సత్కారం

కార్యక్రమం అనంతరం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ పురస్కారాలు అందుకున్న ప్రముఖులను సీఎం చంద్రబాబు సత్కరించారు. గరికపాటి నరసింహరావు, దండముడి సుమతీరామ్మోహన్, అన్నవరపు రామస్వామి, ఎడ్లపల్లి వెంకటేశ్వరరావును సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. వారితో పాటు పశ్చిమ బెంగాల్‌లో దళిత బంధు కార్పొరేషన్ ఉపాధ్యక్షుడిగా ఉన్న వీర్రాజును సీఎం సత్కరించారు.

గాంధీ క్షేత్రంలో..

అవనిగడ్డలో సోమవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో కృష్ణారావు శతజయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రఘురామ కృష్ణంరాజు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారిలు వంతెన సెంటరులోని మండలి వెంకట కృష్ణారావు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అలుపెరుగని ప్రజా సేవకుడు

- డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు

సేవే పరమావధిగా దివిసీమ పునర్నిర్మాణానికి అలుపెరగక శ్రమించిన మండలి వెంకట కృష్ణారావు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారు. ప్రపంచ తెలుగుమహాసభల నిర్వహణ ద్వారా తెలుగు వారిని ఏకంచేసిన మండలి వెంకట కృష్ణారావు చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి.

● ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, తరాలు గడిచినా మండలి వెంకట కృష్ణారావు కీర్తి అజరామరమని కొనియాడారు. తెలుగుభాషాభివృద్ధికి తరతరాలుగా మండలి కుటుంబం పనిచేస్తున్నదన్నారు.

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు మండలి వెంకట కృష్ణారావు అన్నారు.

● పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, ప్రజల మనిషిగా కృష్ణారావు పేదలకు భూపంపిణీ చేయటమే కాకుండా మంత్రిగా ఎన్నో కార్యక్రమాలు అమలుచేసి ఆదర్శ రాజకీయవేత్తగా నిలిచారన్నారు.

● పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ, మండలి వెంకట కృష్ణారావు దివి ప్రజల మనసుల్లో చిరంజీవిగా చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. ఆయన జీవితచరిత్రను పాఠ్యపుస్తకంగా తీసుకురావాలని కోరారు.

● మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ, ఉప్పెన అనంతరం మండలి వెంకట కృష్ణారావు సహాయక చర్యల్లో అహోరాత్రాలు శ్రమించిన తీరు నేటికీ మరువలేమన్నారు.

● మాజీ హోంమంత్రి వసంత నాగేశ్వరరావు మాట్లాడుతూ, దివిసీమ ఉప్పెన సహాయక చర్యల్లో నెత్తురోడుతున్నా బ్యాండేజీలు కట్టుకుని సహాయక చర్యలు కొనసాగించిన గొప్పసేవామూర్తి అని, తెలుగు భాష ఔన్నత్యానికి విశేష కృషిచేశారని కొనియాడారు.

● మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, విద్యుత్ నియంత్రణ మండలి మాజీ అధికారి చంద్రశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకరచౌదరి, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, పిఠాపురం ఆధ్యాత్మిక పీఠం అధినేత ఉమర్ అలీషా, వైకుంఠపురం భవిష్ణు గురూజీ, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్, నెల్లూరు క్లాసికల్ తెలుగుసెంటర్ మాజీ డైరెక్టర్ మునిరత్నం నాయుడు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్, వివిధ రంగాల ప్రముఖులు, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. సభకు వచ్చిన అతిథులను మండలి వెంకట్రామ్, శీలం అశ్విన్‌కుమార్, మండలి కుటుంబసభ్యులు ఆత్మీయ స్వాగతం పలికి సత్కరించారు. తొలుత జ్యోతిప్రజ్వలన చేసి, మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

పెసరకు తెగులు!

» పంట దిగుబడిపై ప్రభావం.. ఆందోళనలో రైతన్న

కంచికచర్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పెసర పంటకు తెగులు సోకింది. తెగులు ఉధృతంగా ఉండటంతో చేలు పసుపుపచ్చగా మారాయి. దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో ఈ ఏడాది తొలకరిలో ఆరేడు వేల ఎకరాల్లో రైతులు పెసర సాగు చేశారు. మే నెల చివర్లో సాగుచేసిన ముదురు తోటలు కోతకు రాగా, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నది. రోజుల తరబడి నాన్పుడు వాన కావటం, తేమ ఆరకపోవటంతో గింజల నుంచి మొలకలు వచ్చాయి. పండిన పంట చేతికి దక్కకుండా పోయింది. జూన్ నెలలో సాగుచేసిన పెసర పైరు ప్రస్తుతం పిందె, కాయ దశలో ఉంది. పక్షం రోజుల్లో చేలు కోతకు రానున్నాయి. అలాంటిది ప్రస్తుతం పెసరకు తెగులు ఉధృతంగా సోకి అదుపులోకి రావటం లేదు. మందులు పిచికారి చేసినప్పటికీ ప్రయోజనం ఉండటం లేదు. చేలు తెగులు వల్ల పసుపుపచ్చగా మారుతున్నాయి. పిందెలు, కాయలు దెబ్బతింటున్నాయి. ఈ తెగులు దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపనున్నది. సాధారణంగా పెసర పంట ఎకరానికి నాలుగు బస్తాల వరకు దిగుబడి వస్తుంది. ఈ తెగులు మహమ్మారి వల్ల సగానికి సగం దిగుబడి తగ్గనున్నది. విత్తనాలు, పురుగు మందులు, ఇతరత్రా కలిపి ఎకరానికి రూ.10 వేలకు పైగా పెట్టుబడి అయింది. ఎకరం కౌలు సగటున రూ. 15 వేలు. పెట్టుబడి సైతం చేతికి అందని దుస్థితి నెలకొన్నది. ముదురు తోటలు భారీ వర్షాల వల్ల, లేత తోటలు తెగులు వల్ల దెబ్బతినటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.



తెగులు సోకటంతో పసుపుపచ్చగా మారుతున్న పెసర చేను, కాయల్లేని చెట్లు

అన్నదాతల రుణ అవస్థలు!

(5వ పేజీ తరువాయి)

మంజూరు చేయటంలో తీవ్ర జాప్యం జరుగుతోందని విమర్శలు ఉన్నాయి.

సొసైటీలకు రాని పర్సన్ ఇన్‌చార్జులు

పీఐసీలుగా ఉన్న అధికారులు నిత్యం సొసైటీలకు రావటానికి వీలుపడటం లేదు. అధికారులు ఎక్కువగా విజయవాడ, ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారు. ఆయా సంఘాల కార్యదర్శులు, సిబ్బంది ఫైళ్లు తీసుకుని సంతకాల కోసం విజయవాడ వెళ్లాల్సి వస్తుంది. రోజూవారి విధులను పక్కన బెట్టి కార్యదర్శులు, సిబ్బంది విజయవాడ చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. అధిక వ్యవప్రయాసలకు గురికావల్సి వస్తుంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రుణాలు సకాలంలో అందకపోవటం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అదనులో రుణాలు లభిస్తే ప్రయోజనం ఉంటుందని రైతులు అంటున్నారు.

425 సంఘాలుంటే 117 సంఘాలకే త్రిసభ్య కమిటీలు

కేడీసీసీ బ్యాంకు పరిధిలో ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం 425 సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో కేవలం 117 సంఘాలకు మాత్రమే ప్రభుత్వం త్రిసభ్య కమిటీలను నియమించింది. ఎన్టీఆర్ జిల్లాలో 131 సంఘాలకు గాను 11 సంఘాలకు, కృష్ణాజిల్లాలో 213 సంఘాలకు గాను 68 సంఘాలకు, ఏలూరు జిల్లాలో 81 సంఘాలకు గాను 38 సంఘాలకు మాత్రమే కమిటీలను నియమించారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని మిగతా 308 సంఘాలకు ఇంకా త్రిసభ్య కమిటీలను నియమించలేదు. పైగా వచ్చే ఏడాది జనవరి 30 వరకు లేదా తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు సంఘాలకు పీఐసీలను నియమిస్తూ ప్రభుత్వం మూడు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సంఘాలకు ఒకేసారి త్రిసభ్య కమిటీలను నియమించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సంవత్సరంపైగా గడిచినప్పటికీ త్రీసభ్య కమిటీలను నియమించటంలో ఎందుకు తాత్సారం చేస్తున్నదో అర్థం కావటం లేదు. కమిటీలు లేకపోవటం వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామంటూ రైతులు వాపోతున్నారు.

భర్త వేధింపులు తాళలేక నవవధువు ఆత్మహత్య

(5వ పేజీ తరువాయి)

అరుణ్‌కుమార్ రోజూ తాగి వచ్చి "నువ్వు అందంగా లేవు.. నీకంటే ముందు నాకు పరిచయం ఉన్న అమ్మాయి అందం ముందు నీవు ఎందుకు పనికిరావు" అంటూ కొట్టి హింసిస్తున్నాడు.. ఇలాంటి వాడి దగ్గర ఉండలేకపోతున్నాను.. మన ఇంటికి వచ్చి మిమ్మల్ని ఇబ్బంది పెట్టలేను.. నిన్ను, నాన్నను తిడుతున్నాడు. వీడిని, వీడి అమ్మ నాన్నలను వదలొద్దు.. ఇక ఈ బాధలు నేను తాళలేను.. నీకు ఈ సారి రాఖీ కట్టలేక పోతున్నాను తమ్ముడు.. అమ్మనాన్నలను జాగ్రత్తగా చూసుకో అంటూ లేఖలో పేర్కొంది. సమాచారం అందుకున్న పోలీసులు శ్రీవిద్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. శ్రీవిద్య తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అరుణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నట్టు సీఐ టీవీవీ రామారావు తెలిపారు.

ఏసీబీ వలలో..

(5వ పేజీ తరువాయి)

జూనియర్ అసిస్టెంట్ గరికిపాటి శ్రీనివాసరావు రూ.30 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో కాంట్రాక్టర్ రాజా ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఈ క్రమంలో సోమవారం రూ.30 వేలు నగదు జూనియర్ అసిస్టెంట్‌కు రాజా ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ బి.వి.సుబ్బారావు నేతృత్వంలో దాడి చేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ మాట్లాడుతూ అదుపులోకి తీసుకున్న శ్రీనివాసరావును ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. దాడుల్లో ఏసీబీ సీఐలు వి.వి.సత్యనారాయణ, ఎం.వి.ఎస్.నాగరాజు, ఎస్ఐ పూర్ణిమ పాల్గొన్నారు.

గాడితప్పిన పాలన!

(5వ పేజీ తరువాయి)

డీఆర్‌డీఏ విభాగం అధికారులు చెప్పుకుంటున్నారు.

ఉద్యోగుల బదిలీల్లో నిబంధనలకు నీళ్లు

జిల్లాలోని మచిలీపట్నం కోడూరు, నాగాయలంక, ఘంటసాల మండలాల ఏపీఎం పోస్టులను భర్తీ చేయలేదు. తమ మనుషులను ఈ మండలాల్లో ఇన్‌చార్జిలుగా నియమించి నెట్టుకొస్తున్నారు. మచిలీపట్నం మండలంలో పనిచేసే సీసీని ఇటీవల పెడనకు బదిలీ చేశారు. ఆమె అక్కడ చేరకుండా మచిలీపట్నం మండల ఏపీఎం హోదాలో అన్ని ఫైళ్లపై సంతకాలు చేయడం గమనార్హం. దీంతో పాటు ఇటీవల జరిగిన బదిలీల్లో జిల్లా సమాఖ్య పరిధిలో పనిచేసే కమ్యూనిటీ కో-ఆర్డినేటర్‌లు ఏడుగురిని జిల్లా కార్యాలయానికి తీసుకువచ్చారు. వీరికి ఎలాంటి బాధ్యతలు అప్పగించకుండా ఖాళీగా కూర్చోబెట్టి మూడు నెలలుగా జీతాలు ఇస్తున్నారని ఆ శాఖ అధికారులే చెబుతున్నారు.

విధులు పక్కన పెట్టి డీఆర్‌డీఏ పీడీ సీసీని అంటూ హడావిడి!

గతంలో అవనిగడ్డ డీపీఎంగా పనిచేసిన అధికారి అనేక ఆరోపణలు ఎదుర్కొన్నారు. సస్పెండ్ అయ్యే వరకు వ్యవహారం వెళ్లింది. గతంలో పనిచేసిన ఇన్‌చార్జి పీడీ ఒకరు మానవతా దృక్పథంతో ఈ అధికారిని సస్పెండ్ చేయకుండా, చార్జి మెమో జారీ చేసి సరిపెట్టారు. అవనిగడ్డ నుంచి జిల్లా కార్యాలయంలో హెచ్ఆర్ విభాగం డీపీఎంగా వచ్చిన ఈ అధికారి తాను చేయాల్సిన పనులను పక్కనపెట్టి, డీఆర్‌డీఏ పీడీ సీసీని అంటూ ఆయన చుట్టూ తిరుగుతున్నాడని జిల్లా కార్యాలయ అధికారులు, సిబ్బంది విమర్శిస్తున్నారు. ఉద్యోగులకు సంబంధించిన పీఎఫ్, మెడికల్ బిల్లులు, మరణించిన ఉద్యోగులకు సంబంధించిన సెటిల్‌మెంట్‌లు కూడా పెండింగ్‌లోనే ఉండిపోతున్నాయని మండిపడుతున్నారు.

29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

» శాప్ చైర్మన్ రవినాయుడు

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఈనెల 29న నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని శాప్ చైర్మన్ రవినాయుడు క్రీడాసంఘాల నిర్వాహకులకు సూచించారు. శాప్ కార్యాలయంలో సోమవారం క్రీడాసంఘాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించిన ఆయన ఈనెల 6 నుంచి 10 వరకు జిలా స్థాయి పోటీలు, 11 నుంచి 15 వరకు జోన్ స్థాయి పోటీలు, 16 నుంచి 20 వరకు రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్టు వివరించారు. స్పోర్ట్స్ డేను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతుందని, పోటీలను తూతూ మంత్రంగా కాకుండా క్రీడాకారులకు ప్రయోజనకరంగా ఉండేలా నిర్వహించాలన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి కేటగిరిలవారీగా నగదు ప్రోత్సహకాలు అందిస్తామని, ఆయా క్రీడా అసోసియేషన్లు సహకారించాలని కోరారు. శాప్ ఏవో ఆర్ వెంకటరమణ నాయక్, స్పోర్ట్స్ ఆఫీసర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.



క్రీడా సంఘాల నిర్వాహకులతో సమావేశంలో మాట్లాడుతున్న శాప్ చైర్మన్ రవి నాయుడు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేయండి

» ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ

మచిలీపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయి స్వాతంత్ర్య దినోత్సవవేడుకలకు ఏర్పాట్లు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌ను స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. పోలీస్ కవాతు, బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజాప్రతినిధులకు ఆహ్వానం, తదితర అంశాలపై ముందస్తుగా ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లాలో అమలుచేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను చాటేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. వర్షాకాలం కావడంతో వాటర్‌ప్రూఫ్ షామియానాలను వేయాలన్నారు. వేడుకల విజయవంతానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, మచిలీపట్నం ఆర్డీవో కె.స్వాతి, డిప్యూటీ కలెక్టర్ పోతురాజు, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, మెప్మా పీడీ సాయిబాబు వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

మీ కోసం సమస్యలు త్వరితగతిన పరిష్కరించండి

» ఎస్పీ గంగాధరరావు



మచిలీపట్నం క్రైమ్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : సామాన్య ప్రజలకు పోలీసు సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి, ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు నిర్వచనంగా నిలుస్తామని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు పేర్కొన్నారు. సోమవారం 'మీ కోసం' కార్యక్రమంలో మొత్తం 30 మంది బాధితులు తమ సమస్యలను ఎస్పీకి అందజేశారు. ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు.



తల్లికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఝాన్సీ రాణి

తల్లికి తలకొరివి పెట్టిన కుమార్తె

» రెండువారాల క్రితమే తండ్రి మృతి

ఘంటసాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : దేవరకోట గ్రామానికి చెందిన అరిగెల ఆదినారాయణ (62), లక్ష్మీ(59)లు భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు. వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఆదినారాయణ రెండు వారాల క్రితం గుండె సంబంధిత వ్యాధితో మృతి చెందాడు. దీంతో మనస్థాపానికి గురై లక్ష్మీ సోమవారం ఉదయం మృతి చెందింది. కుమారులు లేకపోవటంతో హిందూ సాంప్రదాయం ప్రకారం తల్లికి చిన్నకుమార్తె ఝాన్సీరాణి తలకొరివి పెట్టి అంత్యక్రియలు నిర్వహించింది. నిరుపేద కుటుంబంలో వారాల వ్యవధిలోనే దంపతులు మృతి చెందటంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. నెలకొన్నాయి. గ్రామ సర్పంచ్ మద్దాల వెంకటేశ్వరరావు, గ్రామస్థులు లక్ష్మీ పార్థివదేహాన్ని సందర్శించి, కుమార్తెలను పరామర్శించారు.

పది విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించాలి: ఆర్‌జేడీ

గన్నవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించాలని ఆర్‌జేడీ జి.నాగమణి అన్నారు. మండలంలోని దావాజీగూడెం జడ్పీ హైస్కూల్‌ను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థుల నుద్దేశించి ఆమె మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి 580 మార్కులు తెచ్చుకోనేలా లక్ష్యసాధన ఉండాలని చెప్పారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. సమష్టిగా విద్య బోధన చేయాలన్నారు. స్టడీ అవర్స్ నిర్వహించాలని ఆదేశించారు. ఎంఈవో-2 కమల, హెచ్‌ఎం ప్రేమావతి పాల్గొన్నారు.



ఉషారామాలో గ్రాడ్యుయేషన్ డే 7న

ఉంగుటూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో 7న గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గ్రాడ్యుయేషన్ అనేది విద్యార్థి జీవితంలో ఒక మైలురాయి అని, డిగ్రీని పూర్తిచేసిన విద్యార్థుల విద్యా ప్రయాణంలో ఇదొక ముఖ్యమైన ఘట్టంగా నిలుస్తుందని పేర్కొన్నారు. స్థానిక కళాశాలలోని యూ-బ్లాక్ సెమినార్ హాలులో గురువారం ఉదయం 9 గంటలకు స్నాతకోత్సవం ప్రారంభమవుతుందని, ముఖ్యఅతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు హాజరవుతారని చెప్పారు.

గాడి తవ్వారు - పూడ్చటం మరిచారు!

హెచ్చరికలు లేక ప్రమాదాలకు గురవుతున్న ద్విచక్ర వాహన దారులు

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

స్థానిక గీతామందిర్ రోడ్డులో పైప్‌లైన్ నిమిత్తం సీసీ రోడ్డు పగులగొట్టి గాడిచేసి వారం రోజులు కావస్తున్నా పూడ్చకపోవడంతో ద్విచక్రవాహనాలు, సైకిళ్లపై వెళ్లేవారు ప్రమాదానికి గురవుతున్నారు. శివాలయం ఎదురుగా మేదర ఇళ్ల సమీపాన పైప్‌లైన్‌కోసం సీసీరోడ్డును అడ్డంగా పగులగొట్టారు. అనునిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో గాడిపెట్టిన చోట హెచ్చరికలు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రివేళ వాహనాలపై వెళ్లేవారు, కార్లు, గాడిలోపడి ప్రమాదాలు జరుగుతున్నా నగర పంచాయతీ అధికారులు పట్టించుకోపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గాడిని పూడ్చించాలని కోరుతున్నారు.



గీతామందిర్ రోడ్డులోని సీసీ రోడ్డులో ప్రమాదకరంగా గాడి



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

• రూ.కోటిన్నర అంచనాతో నిర్మాణం, జనవరి నాటికి తుది రూపునకు సన్నాహాలు



పెనమలూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్లుగా గ్రామస్థులు కలలుకన్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి పెనమలూరులో సోమవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్, గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. షుమారు ఎనిమిది సెంట్ల ఇరిగేషన్ స్థలంలో ఆలయ నిర్మాణం చేపట్టనున్నారు. పెనమలూరుతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల్లోని అన్ని వర్గాల ప్రజల సహకారంతో వచ్చే జనవరి నాటికి మండలంలోనే తొలి అయ్యప్ప ఆలయ నిర్మాణ పనులు దాదాపు పూర్తి చేసి అన్న సంతర్పణ కార్యక్రమాన్ని మరింత ఘనంగా జరపడానికి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు నిర్ణయించారు.

అన్న సంతర్పణకు ఆద్యులు కేరళ పూజారి..

నలభై ఏళ్ల క్రితం గ్రామంలోని శివాలయం(పెద్దగుడి)లో అర్చక వృత్తి నిర్వహించడానికి కేరళ నుంచి పురాణం మాస్టారు ఉండేవారు. ఆయన మొదట గ్రామంలోని తొమ్మండుగురితో అయ్యప్ప మాల వేయించి శబరిమల తీసుకెళ్లి అయ్యప్ప దర్శనం, జ్యోతి దర్శనం చేయించి.. స్వామివారికి ఇరుముళ్ల చెల్లించి తిరిగి గ్రామానికి చేరుకోగానే ఆలయంలో పవిత్ర ప్రసాదాలను భుజింపజేసేవారు. సదరు ఆచారం కాలక్రమేణా ఇంతింతై..వటుడింతై.. ఊరికే పెద్ద పండుగగా మారి ఏటా లక్షల వ్యయంతో వేలాది మంది భక్తులకు అన్న సంతర్పణ గావించే స్థాయికి చేరింది. పురాణం మాస్టారు నెలకొల్పిన ఆచారాన్ని తదనంతరం బాబాయి మాస్టారు ముందుకు తీసుకెళ్లి సజీవంగా ఉంచారని గ్రామస్థులు తెలిపారు.

తాడిగడప మునిసిపాలిటీలో రోడ్లకు మహర్దశ

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తాడిగడప మునిసిపాలిటీలో సోమవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అభివృద్ధి పనుల శంకుస్థాపనల్లో ముమ్మరంగా పాల్గొన్నారు. తాడిగడపలో రూ. 39.75లక్షల వ్యయంతో ప్రస్తుతం ఉన్న మెయిన్‌రోడ్డును గ్రీన్‌ఫీల్డ్ గేటు నుంచి రాజ్యలక్ష్మి టవర్స్ వరకు బలోపేతం చేయడం, విస్తరణకు శంకుస్థాపన చేశారు. తాడిగడపలోని స్పెక్ట్రా ఫుడ్స్ నుంచి ముక్కామల ఎస్టేట్ వరకు రూ. 38.5 లక్షల ఖర్చుతో రోడ్డును అభివృద్ధి చేసేందుకు శంకుస్థాపన చేశారు. రూ. 37లక్షల వ్యయంతో ఎంఎస్ ల్యాండ్రీ నుంచి ఎస్టీబీఎల్ కాలనీ వరకు ప్రస్తుతం ఉన్న బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కానూరులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కానూరు: కానూరులోని పలు ప్రాంతాల్లో రూ. 1.48 కోట్ల వ్యయంతో చేపట్టే అభివృద్ధి పనులకు సోమవారం స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శంకుస్థాపన నిర్వహించారు. అమరావతి కాలనీ, మాణిక్యనగర్, మహదేవపురం కాలనీ, తులసీనగర్ ప్రాంతాల్లో చేపట్టే సీసీ రోడ్లు, డ్రెయినేజీ, కల్వర్టు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సకాలంలో త్వరితగతిన నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను పూర్తి చేయాలని సూచించారు. తాడిగడప మున్సిపాలిటీలోని నాలుగు గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొనే సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఆయన హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబుతోపాటు పలువురు అధికా రులు, పార్టీ శ్రేణులు, స్థానికులు పాల్గొన్నారు.



క్రైస్తవుల నిరసన ర్యాలీ

కానూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : క్రైస్తవ మతకన్యల అక్రమ అరెస్టుకు నిరసనగా కానూరు కార్మెల్ చర్చి ఫాదర్ సలివేంద్ర శౌరి ఆధ్వర్యంలో సోమవారం క్రైస్తవులు నిరసన ర్యాలీ నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన క్రైస్తవులు కానూరులోని చర్చి వద్ద నుంచి అంబేద్కర్ కార్యక్రమంలో ఫాదర్ సలివేంద్ర శౌరి, సహాయ గురువులు ఫాదర్ మైత్రిదేవ దానం, ఫాదర్ రత్నరాజుతోపాటు సీటీసీ సిస్టర్‌లు, మరియ దళం సభ్యులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధి పనులు

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనులు పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కొత్తగా రూపొందించిన బ్లూ ఫ్రాగ్ అప్లికేషన్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని ఉపాధి హామీ పథకం బాపులపాడు మండల ఏపీవో అశోక్‌కుమార్ తెలిపారు. సోమవారం మండల మహిళా సమాఖ్య భవనంలో బాపులపాడు, ఉంగుటూరు, గన్నవరం మండలా లకు చెందిన ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయి సిబ్బందికి జియో ట్యాగింగ్, జియో ఫెన్సింగ్ బ్లూ ఫ్రాగ్ అప్లికేషన్‌లపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.



జంక్షన్ బస్టాండ్‌లో పాత నేరస్తుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీ

ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : జేబు దొంగల బారిన పడకుండా ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వి. సురేష్ ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన జంక్షన్ ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించారు. ప్రయాణికులకు తగు జాగ్రత్తలు తెలిపారు. పాత నేరస్తుల ఫొటో లతో కూడిన ఫ్లెక్సీని బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేశారు.



ఉయ్యూరు శ్రీలంక కాలనీలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో వైవీబీ రాజేంద్రప్రసాద్

సంక్షేమ పథకాల అమలుపై ప్రజలు సంతృప్తి

శ్రీలంక కాలనీలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో వైవీబీ

ఉయ్యూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉయ్యూరు శ్రీలంక కాలనీలో పర్యటించి సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసి చంద్రబాబుకు అండగా నిలవాలన్నారు. మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు, 3వ వార్డు కౌన్సిలర్ తెనాలి పద్మావతి, ప్రభుత్వ హాస్పిటల్ అభివృద్ధి చైర్మన్ మండవ జయదేవ్, పైడయ్య, అజ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం



గన్నవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మనిషి శక్తిని కొత్త పుంతలు తొక్కిస్తాయని మౌంట్ ఫోర్ట్ ప్రావిన్సియల్ సుపీరియర్ రెవరెండ్ బ్రదర్ ఫైన్ అలెక్స్ అన్నారు. స్థానిక సెయింట్ జాన్స్ మాధ్యమికోన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన బాస్కెట్ బాల్ మూడు కోర్టులు, స్కేటింగ్ గ్రౌండ్‌లను సోమవారం ప్రారంభించారు. విద్యార్థులకు స్కేటింగ్ పోటీలు నిర్వహించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్ కేవీఆర్ కిషోర్ మాట్లాడుతూ, క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం చేకూరు తుందన్నారు. జిల్లా క్రీడా అభివృద్ధి అధికారిణి కె.ఝాన్సీ లక్ష్మి మాట్లాడుతూ, ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్, బాస్కెట్ బాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు బోస్, కార్యదర్శి డి.సత్యన్నారాయణ, బ్రదర్ బాలశౌరి, జిమ్మికురియాకోస్ బల్లా జోసఫ్, జయబాలన్ తదితరులు పాల్గొన్నారు.



బీజేఆర్ నగర్ చర్చికి ఫ్యాన్లను అందిస్తున్న బోడె వెంకట్రామ్

బీజేఆర్ నగర్ చర్చికి ఫ్యాన్ల వితరణ

పెనమలూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పోరంకి బీజేఆర్‌నగర్‌లోని పరమవరుని గాస్పెల్ చర్చికి టీడీపీ యువనేత బోడె వెంకట్రామ్ రూ. 25 వేల విలువైన ఫ్యాన్లను సోమవారం అందజేసి తన సేవా తత్పరతను చాటుకొన్నారు. చర్చిఫాదర్ మట్టా సరోజనమ్మ వెంకట్రామ్‌ను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ద్రోణవల్లి సుబ్బారావు, వినుకొండ రాజా, సౌజన్య, ప్రవీణ్, వీరాస్వామి కొవ్వలి సుదర్శనం, మట్టా నవీన్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థికసాయం

నియోజకవర్గానికి చెందిన నిరుపేద విద్యార్థిని పాలడుగు చైత్రకు సోమవారం యువనేత బోడె వెంకట్రామ్ మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా పదివేల ఆర్థికసాయాన్ని అందించారు. నిరుపేద విద్యార్థుల ఆర్థిక ఇబ్బందుల్లో తాను పాలుపంచుకొంటానని వెంకట్రామ్ తెలిపారు.





కాకులపాడులో.. గన్నవరం యాదవుల రామాలయంలో ప్రత్యేక పూజలు

వైభవంగా గంగానమ్మ విగ్రహప్రతిష్ఠ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : కాకులపాడులో నూతనంగా నిర్మించిన ఆలయంలో గంగానమ్మతల్లి, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం, మహాకుంభాభిషేక పూజలు సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మేళతాళాల మధ్య ప్రతిష్టా యాజ్ఞిక బ్రహ్మ నంది వెలుగు శ్రీబాలాజీ గురుక్కుల్ పర్యవేక్షణలో విగ్రహ దాతలు కామినేని శ్రీహరిరావు, అచ్చిమాంబ దంపతులు ప్రత్యేక పూజలనంతరం విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. మహిళలు ఊరేగింపుగా తీసుకువచ్చిన గంగాజలంతో కూడిన పూర్ణకుంభాలకు కామినేని శ్రీహరిరావు, అచ్చిమాంబ, రామినేని మన్మోహన్, పద్మజ, వీరపనేని రాజా దంపతులు ప్రత్యేక హోమం నిర్వహించిన భక్తుల సమక్షంలో గంగానమ్మతల్లికి మహాకుంభాభిషేకం నిర్వహించారు. కమిటీ సభ్యులు త్రిపురనేని సత్యనారాయణ, చలసాని శ్రీనివాస్, వెలగపూడి రాము, జాస్తి ఫణి, తదితరుల ఆధ్వర్యంలో సుమారు 2వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం

గన్నవరం : స్థానిక యాదవుల రామాలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న ఈ వేడుకలను వేద పండితులు ఉదయం గోపూజ, గణపతిపూజతో ప్రారంభించారు. అనంతరం దీక్షాధారణ, అఖండ దీప స్థాపన, ప్రతిష్టా మూర్తులకు నవవిధ ద్రవ్యాభిషేకం, జలాధివాసం నిర్వహించారు. సాయంత్రం గణపతి, లక్ష్మీ గణపతి హోమాలు, క్షీరాధివాసం, నీరాజనం మంత్రపుష్పం జరిపారు. యాదవ సంఘ నాయకులు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.







వీరవల్లిలో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ఝాన్సీరాణి.. ప్రసాదంపాడులో.. చినఓగిరాలలో..

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

గన్నవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : తల్లిపాలతోనే బిడ్డకు చక్కటి ఆరోగ్యం లభిస్తుందని సీడీపీవో జి.మంగమ్మ అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం బాలింతలకు తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంగమ్మ మాట్లాడుతూ, తల్లిపాలు బిడ్డకు ఇవ్వడం వల్ల తల్లులకు గర్భాశయ, రొమ్ము కేన్సర్ వంటివి రాకుండా ఉంటాయన్నారు. తల్లిపాలల్లో గల పోషకాలను వివరించారు. సూపర్‌వైజర్ సత్యవాణి, అంగన్వాడీ కార్యకర్తలు తులసి, స్వాతి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వీరవల్లి పరిధిలో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : నవజాత శిశువుకు తల్లిపాల ద్వారా ప్రోటీన్లు, విటమిన్లు అందుతాయని అందుకే శిశువు జన్మించిన గంటలోపు తల్లిపాలు తాగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి సూచించారు. వీరవల్లి పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాలే వ్యాధినిరోధకశక్తిని పెంచే మొదటి టీకాఅని ఏఎన్‌ఎం సునీత తెలిపారు. ఈ కార్యక్రమంలో సుహాసిని, నాగమణి, తదితరులతో పాటు ఆశావర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, తల్లులు పాల్గొన్నారు.

పెదఅవుటపల్లి పీహెచ్‌సీలో..

ఉంగుటూరు : బిడ్డల సంపూర్ణ ఆరోగ్యాభివృద్ధికి దోహదపడే సకల పోషకాలు సమృద్ధిగా వున్న తల్లిపాలే శిశువుకు ఎంతో శ్రేయస్కరమని పెదఅవుటపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కరీముల్లా మొహినుద్దీన్ అన్నారు. సోమవారం పెదఅవుటపల్లి పీహెచ్‌సీలో గర్భవతులు, బాలింతలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తల్లిపాల విశిష్టతపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.పద్మాదేవి, డాక్టర్ శాస్త్రి, ఏఎన్‌ఎం సౌదామని, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు,బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.



బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో జి.మంగమ్మ



పెదఅవుటపల్లిలో తల్లిపాల విశిష్టతపై అవగాహన ర్యాలీ

ప్రసాదంపాడులో..

గుణదల : పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని ప్రసాదంపాడు సర్పంచ్ సర్నాల గంగారత్నం అన్నారు. తల్లిపాల వారోత్సవాలు రామవరప్పాడు సెక్టార్ పరిధిలోని ప్రసాదంపాడు అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టాటా ట్రస్ట్ వితరణ చేసిన పోషకాలతో కూడిన ఆహా ర పదార్థాలను గర్భిణులకు అందజేశారు. సీడీపీవో జి.భానుమతి, సూపర్‌వైజర్ స్వర్ణకుమారి, టాటా ట్రస్ట్ నుంచి కిన్నెర, ఎఎన్‌ఎమ్ ఎమ్‌ఎస్‌కె, అంగన్‌వాడీ టీచర్ సత్యవేణి పాల్గొన్నారు.

చినఓగిరాలలో..

ఉయ్యూరు : పిల్లలు ఆరోగ్యంగా ఎదిగేందుకు తల్లి ముర్రుపాలు ఎంతో ఉపయోగపడతాయని చినఓగిరాల సర్పంచ్ యెనిగళ్ల శిరీష అన్నారు. తల్లిపాల వారోత్సవాలు పురస్కరించుకుని చినఓగిరాల అంగన్వాడీ కేంద్రంలో సోమవారం తల్లులు, గర్భిణుల అవగాహన కార్యక్రమంలో సర్పంచ్ పాల్గొని తల్లిపాల విశిష్టత తెలియజేశారు. సూపర్‌వైజర్ బేబి సరోజిని మాట్లాడుతూ, పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు తప్పక తాగించాలన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు ప్రతిభ, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్ పూడికతీత పనుల పరిశీలన



కంకిపాడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ పూడిక తీత పనులు తక్షణం చేపట్టాలని టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరి కృష్ణ అన్నారు. కంకిపాడులో సోమవారం చేపట్టిన డ్రెయిన్ పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. క్లస్టర్ కో కన్వీనర్ పులి శ్రీనివాసరావు, పంచాయతీ శానటరి ఇన్‌స్పెక్టర్ రామారావు, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు చిట్టూరి నాగేశ్వరరావు, బాజీ, అజయ్, వీరంకి శ్యామ్ పాల్గొన్నారు.

సుదిమళ్ల రవీంద్ర మృతి టీడీపీకి తీరని లోటు

ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ

పెనమలూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కంకిపాడు మండల అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర అకాల మృతి టీడీపీకి తీరని లోటని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్ర ప్రసాద్‌లు పేర్కొన్నారు. సోమవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో దివంగత సుదిమళ్ల రవీంద్రకు టీడీపీ నేతలు, కార్యకర్తలు నివాళులర్పించిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. 2014 ఎన్నికల నుంచి తనకు అత్యంత సన్నిహితంగా మెలిగిన రవీంద్ర మృతిని జీర్ణించుకోలేకపోతున్నానని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బోడె వెంకట్రాం, యార్లగడ్డ సుచిత్ర, జనసేన నేత ముప్పా రాజా, తాతపూడి గణేష్, కొండా ప్రవీణ్, మారుపూడి ధనకోటేశ్వరావు, కోయ ఆనంద్ ప్రసాద్, తుమ్మలపల్లి హరికృష్ణ, షేక్ బుజ్జి, శొంఠి శివరాం, పీతా గోపీచంద్, పులి కామేశ్వరరావు, పావనమూర్తి, గోలి వసంత్ పాల్గొన్నారు.

జవహర్ నవోదయ ఆరో తరగతి ప్రవేశానికి గడువు పెంపు

● 9,11 తరగతుల లేటర్ ఎంట్రీలకు గడువు సెప్టెంబరు 23

హనుమాన్‌జంక్షన్ రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతి ప్రవేశపరీక్షకు దరఖాస్తు స్వీకరణ గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ డీ ఏదునందన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన, ఆసక్తిగల విద్యార్థులు ఆగస్టు 13లోగా తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. నవోదయ విద్యాలయాల్లో 9, 11వ తరగతి లేటరల్ ప్రవేశానికి దరఖాస్తు గడువు సెప్టెంబరు 23 గాను, ప్రవేశ పరీక్ష వచ్చే ఏడాది ఫిబ్రవరి 7వ తేదీగా అధికారికంగా నిర్ణయించినట్లు ప్రకటనలో వివరించారు. ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 8, 10వ తరగతి చదివిన విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. అర్హులైన వారు జేఎన్‌వీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జవహర్ నవోదయ వేలేరు ప్రిన్సిపాల్ డీ ఏదునందన ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్టీసీ స్థలం కాపాడుకుంటాం

● రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సన్నద్ధం: ఈయూ

బస్‌స్టేషన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఆర్టీసీ స్థలాలను లులు మాల్‌కు కేటాయింపులను అడ్డుకునేందుకు రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సన్నద్ధం అవుతున్నట్లు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న అనంతపురం, కాకినాడ, తిరుపతి, విశాఖపట్నం, ఒంగోలు, ఏలూరు జిల్లాల్లో, 9న కడప, రాజమండ్రి, నెల్లూరు, శ్రీకాకుళం, గుంటూరు, కృష్ణాజిల్లాల్లో, 13న కర్నూలు, విజయనగరం, పల్నాడు, పార్వతీపురం, భీమవరం, సత్యసాయి జిల్లాల్లో, 17న నంద్యాల, అనకాపల్లి, చిత్తూరు, కోనసీమ, అన్నమయ్య, పాడేరు, బాపట్ల జిల్లాల్లో ఎంప్లాయీస్ యూనియన్ ముఖ్య నేతల సమావేశాలు, విలేకరుల సమావేశాలు, అనంతర కార్యాచరణ ప్రకటనలు ఉంటాయన్నారు. రాష్ట్రస్థాయిలో ఒక సమావేశం ఏర్పాటు చేసి ఆర్టీసీ స్థలాలను కాపాడుకునేందుకు ఒక కార్యాచరణను రూపొందిస్తామన్నారు. మరోవైపు ఆర్టీసీ ఆస్తుల రక్షణకు పోరాడేవారెవరికైనా మద్దతు ఉంటుందని ప్రకటించారు.

చీటింగ్ కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

విజయవాడ లీగల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తానని ఓ వ్యక్తి నుంచి డబ్బులు తీసుకుని ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేసిన నిందితుడిపై నేరం రుజువుకావడంతో మూడేళ్ల జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి బీ రాధారాణి సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం బాధితుడు మహబూబ్‌నగర్ జిల్లా బొల్లారం గ్రామంలో తన కుటుంబంతో కలిసి నివశిస్తున్నాడు. కంచికచర్లలోని కళాశాలలో చదువుతున్న సమయంలో వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్స్‌కు విజయవాడ ఐఈఎం స్టేడియంలో కోచింగ్ తీసుకొన్నాడు. భవానీపురం పాత ఎంబీజీ కాలనీకి చెందిన షేక్ మహబూబ్ సుభాని బాధితుడికి పరిచయమై తాను ఆర్మీలో జాబ్ చేస్తున్నానని, బాధితుడికి కూడా ఉద్యోగం ఇప్పిస్తానని కాకపోతే కొంచెం డబ్బులు ఖర్చవుతాయని నమ్మబలికాడు. దీంతో బాధితుడు 2013 నవంబరు 29 నుంచి పలు దఫాలుగా రూ.3.25 లక్షలు సుభానీకి ముట్టజెప్పాడు. ఎప్పటికీ జాబ్ రాకపోవడంతో బాధితుడు విజయవాడ వచ్చి సుభానీని నిలదీయగా డబ్బులివ్వను ఏం చేసుకొంటావో చేసుకోమని బెదిరించినట్లు బాధితుడు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సుభానీపై ఐపీసీ 420 కింద కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి, నిందితుడిపై నేరం రుజువుకావడంతో పై శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

రిటైర్డ్ అధికారిని అదే పదవిలో నియమించడం రాజ్యాంగ విరుద్ధం

● ఏపీ పశు సంవర్ధకశాఖ గెజిటెడ్ అధికారుల సంఘం

గాంధీనగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గతంలో రిటైర్డ్ అయిన పశు సంవర్ధకశాఖ రాష్ట్ర డైరెక్టర్ టీ దామోదరనాయుడును కాంట్రాక్ట్ పద్ధతిలో తిరిగి డైరెక్టర్‌గా నియమించాలనుకోవడం రాజ్యాంగ విరుద్ధమని పశు సంవర్ధన శాఖ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ హెచ్ఎస్ కృష్ణారావు తెలిపారు. ఈ నిర్ణయాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అతడిని కొనసాగిస్తే ఉద్యోగ సంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. శాఖలో అర్హత కలిగిన అధికారులను డైరెక్టర్‌గా నియమించాలని కోరారు. ప్రధానకార్యదర్శి ఎస్ఎల్ గణేశ్వరరావు, కోశాధికారి ఎన్.సతీష్ కుమార్, జాయింట్ సెక్రటరీ ఈ.రాజేష్ పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీలు నిర్వహించాలి

● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, అధికారులు

కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతినెల 5న అన్ని గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో వాట్సాప్ గవర్నెన్స్ (మన మిత్ర యాప్)పై అవగాహన ర్యాలీలను నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీశ ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం డిజిటల్ సేవల్లో భాగంగా వాట్సాప్ గవర్నెన్స్ (మన మిత్ర యాప్) ప్రజల చేతిలో ప్రభుత్వం అనే పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా మనరాష్ట్రంలో వాట్సాప్ గవర్నెన్స్‌ను తెచ్చామని, 26 శాఖలకు చెందిన 530కు పైగా సేవలు అందుబాటులో ఉంచామన్నారు. మనమిత్ర వాట్సాప్ 9552300009 అనే నెంబరుపై అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 5న మంగళవారం నుంచి ప్రతి నెల 5న జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో ర్యాలీలను నిర్వహించాలని, వీఆర్వోలు, విలేజ్ సర్వే అసిస్టెంట్లు, వార్డు రెవెన్యూ సెక్రటరీలు పాల్గొనాలని, సెరికల్చర్, ఫిషరీస్ అసిస్టెంట్లు వార్డ్ హెల్త్ సెక్రటరీలు, ఏఎన్ఎంలు పాల్గొని అవగాహన కల్పించాలని, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ర్యాలీలపై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పోస్టర్ విడుదలలో గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జీ జ్యోతి, డీఆర్‌డీఏ పీడీ ఎఎన్‌వీ నాంచారరావు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరేయాలి

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రతి ఒక్కరిలో దేశభక్తిని పెంపొందించేలా హర్ ఘర్ తిరంగా జిల్లావ్యాప్తంగా నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. హర్ ఘర్ తిరంగా 2025 సందర్భంగా ప్రచార పోస్టర్‌ను సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 8 వరకు పాఠశాల, అన్ని విద్యాసంస్థల్లో హర్ ఘర్ తిరంగా నిర్వహించాలన్నారు. 9 నుంచి 12 వరకు తిరంగా మహోత్సవ్ పేరుతో ప్రజాప్రతినిధులు, వీఐపీలు పాల్గొనేలా ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని, స్థానిక ఉత్పత్తులతో డ్వాక్రా మహిళలతో తిరంగా కలర్ థీమ్‌తో ప్రత్యేక తిరంగా మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు తిరంగా యాత్ర 13 నుంచి 15 వరకు ప్రభుత్వ భవనాలను, పాఠశాలలను, హోటళ్లను, వంతెనలు, డ్యాంలను విద్యుద్దీకరించి, అలంకరించి జాతీయ జెండాలను ఎగుర వేయడానికి సిద్ధం చేయాలన్నారు.

తల్లిపాల విశిష్టతను చాటిచెప్పండి

పుట్టినప్పటి నుంచి తల్లి పాలివ్వడం బిడ్డ ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమని, చనుబాలుకు మించి ఔషధం మరొకటి లేదనే విషయాన్ని ప్రజల్లో అవగాహన కల్పించేలా వారోత్సవాలు నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో ఈనెల 7 వరకు నిర్వహించనున్న తల్లిపాట వారోత్సవాల సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని రోగనిరోధక శక్తి అధికంగా ఉండే తల్లి పాలు బిడ్డ ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమన్నారు. వైద్యుల ద్వారా గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించేందుకు జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ర్యాలీలు, గృహ సందర్శనలు, గర్భిణులకు సామూహిక సీమంతాలు, పౌష్టికాహార పంపిణీ, ఆరోగ్య పరీక్షలు, జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు.

నులిపురుగు నివారణ మాత్రలివ్వాలి

జిల్లావ్యాప్తంగా ప్రతి చిన్నారికి అల్బెండజోల్ నులిపురుగు నివారణ మాత్రను పంపిణీ చేసేందుకు అధికారుల సమన్వయంతో చర్యలను తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈనెల 12దీన నిర్వహించనున్న నులిపురుగుల నివారణ దినోత్సవం (నేషనల్ డీవార్మింగ్ డే) సందర్భంగా సోమవారం కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నులిపురుగు నివారణకు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ప్రతి ఏడాది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తాయన్నారు. దీనిలో భాగంగా ఏడాది నుంచి 19 ఏళ్ల వయసులోపు ప్రతి ఒక్కరికీ అల్బెండజోల్ నులిపురుగు నివారణ మాత్రను పంపిణీ చేసేందుకు వైద్యాధికారులు సిద్ధం చేశారన్నారు. అనంతరం పోస్టర్ విడుదల చేశారు. ఆయా కార్యక్రమాల్లో జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియా, డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, యువజన సంక్షేమ అధికారి కే శ్రీనివాసరావు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి ఎస్‌కే రుక్సానా, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, గ్రామవార్డు సచివాలయాల జిల్లా అధికారి జి.జ్యోతి పాల్గొన్నారు.

వైద్యంపై అవగాహన అవసరం

● రాజధాని అభివృద్ధిలో వైద్యులు భాగస్వామ్యం కావాలి ● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



సిద్ధార్థ అకాడమి ప్రతినిధులతో కలసి ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

గన్నవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): దైవం మనిషికి ప్రాణం పోస్తే ఆ వ్యక్తి ప్రాణం పోకుండా కాపాడి మరో జీవితాన్ని ఇచ్చే శక్తి వైద్యులకు మాత్రమే ఉందని, అందుకే వైద్యులను దైవంగా భావిస్తారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలలో వారం పాటు జరిగే ఆరోగ్య అవగాహన ప్రదర్శనను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ వైద్యులు కేవలం డబ్బు సంపాదన కోసమే కాకుండా మానసిక తృప్తి కోసం పేద రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించాలని సూచించారు. ఎంతోమంది వైద్యులు పేద రోగులకు ఉచితంగా వైద్య సాయం చేస్తూ సమాజంలో ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఇక్కడ చదువుతున్న వైద్య విద్యార్థులు ప్రపంచంలో మేటి రాజధానిగా నిలవబోతున్న అమరావతి ప్రాంతంలో వైద్యశాలలు ఏర్పాటు చేసి అమరావతిని మెడికల్ హబ్‌గా మార్చే ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 50 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన సిద్ధార్థ అకాడమీ లాభాపేక్ష లేకుండా నేడు 18 విద్యాసంస్థలతో, ఏటా 26వేల మంది విద్యార్థులకు విద్యను అందించటం అభినందనీయమన్నారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య మాట్లాడుతూ యార్లగడ్డను ఎమ్మెల్యేగా గెలిపించుకోవడం నియోజకవర్గ ప్రజల అదృష్టమన్నారు. అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కోశాధికారి సూర్రెడ్డి వెంకటేశ్వరరావు, వైద్య కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ భీమేశ్వరరావు, సూపరింటెండెంట్ డాక్టర్ బీ అనిల్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కే కల్యాణి, డాక్టర్ సూరపనేని రాజగోపాల్, హెచ్‌వోడీలు పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి ఆసాంతం తిలకించిన యార్లగడ్డ ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దంత వైద్య కళాశాలలో..

డాక్టర్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన ఆరోగ్య అవగాహన ప్రదర్శన ప్రారంభించారు. దంత వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు, హెచ్‌వోడీలు స్టాల్స్ గురించి వివరించారు. అకాడమిలో 50ఏళ్ల నుంచి ఉద్యోగం చేస్తున్న వై మధుసూదనరావును దుశ్శాలువ, పూలబొకేతో ఘనంగా సత్కరించారు.

నగరంలోని ఓ జంటకు పెళ్లయి ఆరేళ్లు గడిచినా సంతానం కలగలేదు. వారు తిరగని గుడి, మొక్కని దేవుడు లేడు. అయినా ఫలితం లేకపోవడంతో చివరి ప్రయత్నంగా నగరంలోని ఓ ఫెర్టిలిటీ కేంద్రాన్ని ఆశ్రయించారు. ఏడాది కాలం పరీక్షలు, మందుల పేరుతో లక్షల్లో డబ్బు వసూలు చేసినా, పిల్లలు పుట్టే అవకాశం లేదని తేల్చడంతో ఆ జంట నిరాశలో మునిగారు.

మరో జంటకు పెళ్లయి 14 ఏళ్లు అవుతుంది. భర్త ఓ కంపెనీలో ఉద్యోగి, భార్య గృహిణి. మొదటి రెండేళ్లు సంతానం వద్దనుకున్నారు. తరువాత గుడులు, బాబాలు, ఆసుపత్రులు ఇలా అన్నీ ప్రయత్నించారు. చివరకు ఓ ఐవీఎఫ్ కేంద్రాన్ని సంప్రదించారు. 15 నెలలు జాగ్రత్తలు తీసుకుని, రూ.16 లక్షలు ఖర్చు చేసినా ఫలితం లేకపోవడంతో, సంతానం కలిగే అవకాశం లేదని కేంద్రం తేల్చడంతో మోసపోయామని గ్రహించారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

నవ జంటల్లో సంతాన శూన్యత..!

ఫెర్టిలిటీలకు పరుగులు పెడుతున్న జంటలు ● రూ.లక్షల్లో దోచుకుంటున్న కేంద్రాలు



నగరంలోని అనేక ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ కేంద్రాలు సంతానలేమి ఉన్న జంటల అవసరాన్ని ఆసరాగా తీసుకుని లక్షల్లో డబ్బు వసూలు చేస్తున్నాయి. 35 ఏళ్లు దాటాక పెళ్లి చేసుకున్నవారిలో సంతానలేమి సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పురుషుల్లో ఒత్తిడి, అనారోగ్యం, వృషణ సమస్యలు, అధిక వేడి చేసే వృత్తుల వల్ల వీర్యం పలుచబడుతోంది. మహిళల్లో 35 ఏళ్ల తర్వాత అండం అభివృద్ధి తగ్గుతుంది, 40 ఏళ్లకు సంతానం కలిగే అవకాశం దాదాపు లేకుండా పోతుంది. జంక్‌ఫుడ్ వల్ల మహిళల్లో సంతానలేమి సమస్యలు పెరుగుతున్నాయి. ఒబెసిటీ, పాలిసెప్టిక్ ఒవేరియన్ డిసీజ్ వంటివి అండం విడుదలను అడ్డుకుంటాయి. వీధి ఆహారాలు హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తాయి. ఫెర్టిలిటీ కేంద్రాలు రెండు మూడు పరీక్షలతో సంతానం కలిగే అవకాశాన్ని తెలుసుకోగలవు, కానీ కొన్ని కేంద్రాలు ఈ విషయాన్ని దాచి, అనవసర పరీక్షలతో లక్షలు వసూలు చేస్తాయి. ఫెర్టిలిటీ కేంద్రాలు రెండు రకాలు. లెవెల్-1 కేంద్రాలు శుక్రకణాల సంఖ్య తక్కువగా ఉంటే ఇంజక్షన్ ద్వారా గర్భం దాల్చేలా చేస్తాయి. ఇది తక్కువ ఖర్చుతో కూడుకున్నది. లెవెల్-2 కేంద్రాలు పిండాన్ని అభివృద్ధి చేసి, అద్దె గర్భాశయంలో ఉంచుతాయి. ఇది ఖర్చుతో కూడుకున్న వ్యవహారం.

జీజీహెచ్‌లోని గైనకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ జీ కేశవచంద్ర మాట్లాడుతూ లేటు వయస్సు పెళ్లిళ్లు, జంక్‌ఫుడ్, శారీరక శ్రమ లేమి వల్ల హార్మోన్ల మార్పులు సంతానలేమికి కారణమవుతాయని చెబుతున్నారు. ఫెర్టిలిటీ కేంద్రాలను ఆశ్రయించేవారు ముందుగా వాటి చరిత్ర, ప్రక్రియ వ్యవధి తెలుసుకోవాలి. కొన్ని కేంద్రాలు పరీక్షల పేరుతో కాలయాపన చేస్తూ డబ్బు దోచుకుంటాయి. దీనివల్ల జంటలు నిరాశకు, ఆర్థిక నష్టానికి గురవుతారని ఆయన పేర్కొన్నారు.

దొంగను పక్కన బెట్టి.. బాధితులపై అనుమానం

● చివరకు దొరికిన వింత దొంగ

● పోలీసుల తీరుతో బిత్తరబోయిన బాధితులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వీడో వింత దొంగ. వాడే ఇళ్లకు కన్నం వేస్తాడు. విచారణకు వచ్చిన పోలీసుల వెంట కలిసి తిరుగుతాడు. వారికి మంచి మర్యాదలు చూస్తాడు. పోలీసులు బాధితులనే అనుమానించేలా వారిని మభ్య పెడతాడు. ఈ వింత దొంగను చివరకు ఓ సీసీ కెమెరా పట్టించింది. ఈ వింత దొంగ వివరాలిలా ఉన్నాయి. కొండపల్లి శాంతినగర్‌కు చెందిన ఓ వ్యక్తి విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి, చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాలు ప్రారంభించాడు. గత ఏడాది తనుండే ప్రాంతంలోనే దొంగతనం చేశాడు. బాధితుల ఫిర్యాదుతో విచారణకు వచ్చిన పోలీసులతో పరిచయాలు పెంచుకొని కలివిడిగా తిరగాడు. ఈ కేసులో దొరకపోవడంతో అదే రీతిలో దొంగతనాలు ప్రారంభించాడు. గత నెల 30న కోడె తేజ ఇంట్లో ప్రవేశించిన దొంగ ఆ ఇంట్లోని 65 కాసుల బంగారం, 1.5 కిలోల వెండి, రూ.80 వేల నగదును అపహరించాడు. తేజ ఇంటి వెనుకున్న సీసీ కెమెరాను చూసి పని చేయడం లేదనుకొని జారుకున్నాడు. షిరిడీ యాత్ర నుంచి వచ్చిన తేజ ఇంట్లో చోరీ విషయం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణకు వచ్చిన పోలీసులతో ఎవరైతే దొంగతనం చేశాడో అతడే కలిసి తిరగడం, మంచి చెడ్డ చూడటం ప్రారంభించాడు. పైగా ఏం ఎరగనట్లు బాధితుల పైనే అనుమానం వచ్చేలా మాట్లాడి మభ్య పెట్టాడు. బాధితుడి స్వగ్రామం కవులూరు అని అతడే తమ బంధువుల ఇళ్లలో దాచిపెట్టి ఉంటాడని దొంగ పోలీసులకు చెప్పడంతో పోలీసులు నమ్మడం శోచనీయం. పోలీసులు సైతం దొంగకు వంత పాడుతూ బాధితుల కాల్ లిస్టు పరిశీలించడం వివాదాస్పదం అయింది. బాధితుడి ఇంటి వెనుక ఉన్న సీసీ కెమెరాను పరిశీలించిన పోలీసులకు దిమ్మ తిరిగిపోయింది. ఇప్పటి వరకు దొంగను పక్కన పెట్టుకొని బాధితులను అనుమానించామని నాలుక్కరుచుకొని దొంగను అతడికి సహకరించిన వారిని పట్టుకొని విజయవాడ కార్యాలయానికి తరలించారు. తమదైన శైలిలో విచారించిన పోలీసులకు వారి వద్ద నుంచి కొంత బంగారం, నగదు రికవరీ చేసినట్టు తెలిసింది.

అర్జీదారులతో మర్యాదగా ప్రవర్తించండి: కలెక్టర్

విజయవాడ సిటీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను నిర్దిత గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జీ లక్ష్మీశ ఉన్నతాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశపు మందిరంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వాటి పురోగతిపై ఆయా శాఖల అధికారుతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్ పోర్టల్‌లో లాగిన్ అయి, ప్రజలిచ్చిన అర్జీలను చూడాలని, రీ ఓపెన్ కేసులపై పూర్తిగా విచారణ జరిపాలన్నారు. అర్జీదారులతో మర్యాదగా ప్రవర్తిస్తూ, సవివరమైన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు.

విజయవాడ రూరల్ మండలంలోని నిడమానూరులో ఖాళీగా ఉండి బీడు పట్టిన 39.16 ఎకరాల వక్ఫ్ భూమికి వేలం నిర్వహించి ఉపయోగంలోకి తేవాలని 14 మంది ముస్లింలు కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు. కొత్తూరు తాడేపల్లిలోని అటవీ భూముల సాగుకు అనుమతివ్వాలని కోరుతూ 11 మంది ఎస్టీలు అర్జీ ఇచ్చారు. ఆశా వర్కర్లను సీనియారిటీ ప్రకారం సర్దుబాటు చేయాలని కోరుతూ ఏపీ ఆశా వర్కర్ల యూనియన్ కార్యదర్శి ఏ కమల ఆధ్వర్యంలో పలువురు ఆశా వర్కర్లు అర్జీ ఇచ్చారు. గంపలగూడెం మండలం అమ్మిరెడ్డిగూడెం - గంగాదేవిపాడు గ్రామాల మధ్యలోని డొంక రోడ్డును ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని కోరుతూ 15 మంది రైతులు అర్జీ ఇచ్చారు. రెవెన్యూ శాఖకు 32, పోలీస్ 23, విద్య 21, ఎంఏయూడీకి 14, పంచాయతీ రాజ్‌కు 11, వైద్యారోగ్యకు 9, సోషల్ వెల్ఫేర్‌కు 6, ఏపీసీపీడీసీఎల్‌కు 3, డిజేబుల్డ్ వెల్ఫేర్‌కు 3, ఎంప్లాయిమెంట్‌కు 3, స్టాంప్స్, రిజిస్ట్రేషన్‌కు 3, సివిల్ సప్లైకి రెండు, ఇరిగేషన్‌కు రెండు, మార్కెటింగ్‌కు రెండు, ట్రెజరీకి రెండు, వ్యవసాయ, ఏపీఎస్ఆర్టీసీ, డీఆర్‌డీఏ, మైనార్టీ వెల్ఫేర్, ఆర్‌డబ్ల్యూఎస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, సర్వే, నీటి పారుదల శాఖకు ఒక్కోటి చొప్పున అర్జీలు అందాయి. జేసీ ఇలక్కియా పాల్గొన్నారు.

రైల్వే అదనపు జీఎంగా సత్యప్రకాష్ బాధ్యతల స్వీకరణ



రైల్వేస్టేషన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్‌గా సోమవారం సత్యప్రకాష్ బాధ్యతలు స్వీకరించారు. రైల్వేలో ఇంజనీరింగ్ సేవ విభాగానికి చెందిన సత్యప్రకాష్ సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఇంతకుముందు ఆయన నిర్మాణపు పనుల ముఖ్య పరిపాలన అధికారిగా పనిచేశారు. సివిల్ ఇంజనీరింగ్‌లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి పట్టా పొందిన ఆయన 35 ఏళ్లుగా రైల్వేలోని అనేక విభాగాల్లో ముఖ్యమైన పదవుల్లో పనిచేశారు. పశ్చిమ రైల్వే సురేంద్రనగర్‌లో అసిస్టెంట్ ఇంజనీర్‌గా ఉద్యోగాన్ని ప్రారంభించిన సత్యప్రకాష్ నార్త్ సెంట్రల్ రైల్వేలోనూ సేవలందించారు. అలహాబాద్‌లోని సెంట్రల్ ఆర్గనైజేషన్ ఫర్ రైల్వే ఎలక్ట్రిఫికేషన్ (కోర్)కు ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్‌గా, పూణేలోని ఇండియన్ రైల్వే ఇనిస్టిట్యూట్ ఆఫ్ సివిల్ ఇంజనీర్ డీన్‌గానూ సేవలందించారు. సింగపూర్, మలేషియాలో శిక్షణ పొందారు. అలహాబాద్‌లో పనిచేస్తున్నప్పుడు రైల్వే మంత్రి అవార్డును అందుకున్నారు. గడ్డర్ వంతెనలపై లాంగ్ వెల్డ్ రైళ్లు అనే అంశం పైన 3 పరిశోధన సాంకేతిక పత్రాలను ప్రచురించారు.



ఎమ్మెల్సీ ఆలపాటికి వినతిపత్రం అందజేస్తున్న సంఘ నేతలు

ప్రభుత్వ దృష్టికి ఉపాధ్యాయుల ఆందోళనలు

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

గవర్నర్‌పేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల్లో నెలకొన్న ఆందోళనలు, అశాంతి తప్పనిసరిగా ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళతానని కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక డెమొక్రటిక్ పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆలపాటి మాట్లాడుతూ ఉపాధ్యాయుల మనోభావాలకు ప్రాధాన్యత ఇచ్చి ఎస్జీటీల మాన్యువల్ కౌన్సెలింగ్‌కు మంత్రిని ఒప్పించగలిగామన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డీ శ్రీను మాట్లాడుతూ బదిలీ అయిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు ఇప్పించేలా కృషి చేయాలని ఎమ్మెల్సీని కోరారు. ఈ సందర్భంగా సమస్యలపై తయారు చేసిన వినతిపత్రాన్ని ఎమ్మెల్సీకి అందజేశారు. నేతలు పెరుమాళ్లు, నున్న రాంబాబు, పీ నాగరాజు, కోట సుందరరావు, ఏ శ్రీనివాస్, ఈ వెంకటరెడ్డి, అక్బర్ పాషా, జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా

మెప్మా-బెస్ట్ మార్ట్ మధ్య ఎంవోయూ


గాంధీనగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), బెస్ట్ మార్ట్ ఆన్‌లైన్ సర్వీస్ సంస్థ మధ్య అవగాహన ఒప్పందం గాంధీనగర్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్ మాట్లాడుతూ పట్టణాల్లో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు ప్రైవేట్ సంస్థల పాత్ర కీలకమన్నారు. బెస్ట్ మార్ట్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫామ్ వల్ల స్థానిక యువత, మహిళ సంఘాలు, చిన్న వ్యాపారులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఈ ఒప్పందంపై హర్షం వ్యక్తం చేస్తూ పట్టణ ప్రాంతాల్లోని పేదలు, మహిళల సామాజిక, ఆర్థికాభివృద్ధికి ఈ ఒప్పందం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. బెస్ట్‌మార్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ ఒప్పందంతో ఎస్‌హెచ్‌జీ ఉత్పత్తులకు ఉచిత డిజిటల్ ప్రొఫైల్, మార్కెటింగ్ మద్దతు, స్థానికంగా అమ్మకాలు జరిగేలా ప్రోత్సాహాన్ని అందిస్తామన్నారు.

ప్రజాసమస్యలను పరిష్కరించండి: డీఆర్వో



ప్రజలనుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

మచిలీపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక (మీకోసం)లో వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను పరిశీలించి, పరిష్కరించాలని డీఆర్వో కే చంద్రశేఖరరావు అధికారులను ఆదేశించారు. మీకోసంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో అధికారులతో కలిసి ఆయన ప్రజల నుంచి 152 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇచ్చిన అర్జీలు ఎంతమేర పరిష్కారానికి నోచుకుంటున్నాయనే అంశంపై సీఎంవో నిత్యం ఆరా తీస్తోందన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండి, ప్రజలిచ్చిన అర్జీల్లోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. డ్వామా, డీపీవో, ఆర్‌డీవో, వైద్యశాఖ కార్యాలయాలు ఈ ప్రక్రియలో ముందంజలో ఉన్నట్టు తెలిపారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో నూతన ఆవిష్కరణలను కేంద్రప్రభుత్వం ప్రోత్సాహిస్తోందని, వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులు, అధికారులతో మాట్లాడి, వారి అభిప్రాయాలను నిర్దేశించిన ఫార్మాట్‌లో నివేదికలు పంపాలన్నారు. ఈ సందర్భంగా ఈనెల 12న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలనకు సంబంధించి అవగాహన పోస్టర్ అధికారులు ఆవిష్కరించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



రాత్రి పూట రోడ్డు పక్కన మట్టి తొలగించిన ప్రదేశం, మట్టి తోలకానికి సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు

నందివాడలో అక్రమంగా మట్టి తోలకాలు

నందివాడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సుమారు 10 ట్రాక్టర్లతో నందివాడలోని ఏలూరు డొంక రోడ్డులో ఆదివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో జేసీబీతో సుమారు 150 ట్రక్కుల వరకు నందివాడ తరలించినట్లు పెయ్యేల జోసఫ్, కళ్లెంపూడి పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ ఆదివారం రాత్రి 12 గంటలు దాటాక ఒక జేసీబీ, 10 ట్రాక్టర్లతో నందివాడ పరిధిలోని మా చెరువు పక్కన గొయ్యి పెట్టి మట్టి తోలికెళ్లారన్నారు. తమకు రాత్రి నిద్రపోతున్న సమయంలో తెలియలేదు. ఉదయం చెరువు వద్దకు వెళ్లి చూడగా, చెరువు బారు రోడ్డు పక్కనే మట్టి తోలికెళ్లినట్లు ఉంది. వెంటనే 112కు ఫోన్ చేశామన్నారు. అసలే మట్టి లేక నానా అవస్థలు పడుతుంటే చెరువుకు తన్నుడుగా పోసుకున్న మట్టిని అర్ధరాత్రులు తొలగించటం ఎంతవరకు న్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నందివాడ తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు కూడా చేశామన్నారు. రాత్రుల పూట అక్రమంగా మట్టి తోలకాలు జరిపిన వ్యక్తులను పట్టుకుని తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంపై ఆర్ఐ గణేష్‌ను వివరణ కోరగా, మాకు జోషఫ్ పద్మావతి ఫిర్యాదు ఇచ్చిన మాట వాస్తవమేనన్నారు. నేను మా సిబ్బందితో వెళ్లి మట్టి తోలకాలు ప్రదేశాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలి

కూచిపూడి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మొవ్వ సీడీపీవో కార్యాలయం ఎదుట అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలు చేసే ప్రతి పనీ ఫోన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉన్నందున కార్యకర్తల ఫోన్లు పాడైపోయాయని, వాటిని తీసుకుని కొత్త ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీడీపీవో ప్రసన్న విశ్వనాథ్‌కు వినతి పత్రం అందజేశారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు సీడీపీవో వారికి తెలిపారు. అంగన్వాడీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మొవ్వలో ధర్నా చేస్తున్న అంగన్వాడీలు


వినతులను పరిశీలిస్తున్న డీఎస్పీ ధీరజ్ వినీల్

న్యాయం చేసేందుకే పోలీసు వ్యవస్థ

తోట్లవల్లూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు న్యాయం చేసేందుకే పోలీసు వ్యవస్థ ఉందని గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ అన్నారు. తోట్లవల్లూరు పోలీస్‌స్టేషన్ వద్ద సోమవారం ప్రజల వద్దకే పోలీస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతు పోలీసులను స్నేహితుల్లా భావించి స్టేషన్‌కు వచ్చి సమస్యను తెలియజేస్తే చట్టపరంగా న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. పలువురు తమ సమస్యలను వినతి పత్రాల ద్వారా డీఎస్పీకి అందించారు. సీఐ వై చిట్టిబాబు, ఎస్సై సీహెచ్ అవినాష్ పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా అంజనాదేవి

గుడ్లవల్లేరు :గుడ్లవల్లేరు మండలపరిషత్‌కు నూతనంగా నియమితులైన డిప్యూటీ ఎంపీడీవోగా జి.అంజనాదేవి బాధ్యతలను సోమవారం చేపట్టారు. కాగా ఆమెకు ఎంపీడీవో ఎండి ఇమ్రాన్, ఇప్పటివరకూ ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన ఎ.ఎన్.ఎల్ నరసింహారావులు స్వాగతం పలికారు. అనంతరం మండలంలోని పంచాయతీల సెక్రటరీలు, మండల పరిషత్ సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చాలు ఇచ్చారు.

పామర్రు సీడీపీవోగా సన్యాసమ్మ

పామర్రు: పామర్రు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణిగా చౌదరి సన్యాసమ్మ సోమవారం నూతన బాధ్యతలను స్వీకరించారు. విజయనగరం జిల్లా రాజం ప్రాజెక్టు సూపర్ వైజర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై పామర్రు సీడీపీవోగా ఆమె పామర్రుకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన భానుశ్రీ జిల్లా అధికారిణిగా పదోన్నతి పొంది గుంటూరు వెళ్లారు. సన్యాసమ్మను పామర్రు ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది పుష్పగుచ్చాలు అందించి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సత్యశ్రీ, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

మాటలు నీటి మూటలేనా..!

- ప్రయాణించాలంటే ముక్కు మూయాల్సిందే..
- చెత్త సేకరణలో డొల్లతనం
- రోజు రోజుకు పెరుగుతున్న దోమల వృద్ధి
- రోగాలబారిన పడుతున్న ప్రజలు

(ఆంధ్రజ్యోతి - గుడివాడ) : పారిశుధ్య నిర్వహణకు పెద్దపీట వేసి ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరిస్తున్నామని మున్సిపల్ అధికారులు చెబుతున్న మాటల్లో డొల్లతనం బయటపడింది. గుడివాడ కొత్త బైపాస్ రోడ్డు, ముదినేపల్లి రోడ్డులో మల్లాయిపాలెం రైల్వే గేటు వరకు ప్రయాణిస్తే నిజనిజాలు నిర్ధారణ అవుతాయి. గుడివాడ పట్టణంలో ఎక్కడా చెత్త లేకుండా చేశామని చెబుతున్న మున్సిపల్ అధికారులు మాటలు నీటిమూటలే.

> **చెత్త సమస్యను పరిష్కరిస్తా**
>
> మున్సిపాల్టీ పరిధిలో వలివర్తిపాడు పంచాయతీ శివారు కాలనీల నుంచి చెత్తను డంప్ చేస్తున్నారు. చెత్త తొలగింపుపై వెంటనే చర్యలు తీసుకోవాలని వలివర్తిపాడు పంచాయితీ కార్యదర్శులకు నోటీసులివ్వనున్నాం. చెత్తను తొలగించి సమస్యను పరిష్కరిస్తా.
>
> **సింహాద్రి మనోహర్, మున్సిపల్ కమిషనర్**

చెత్త సేకరణలో బయటపడ్డ డొల్లతనం

పట్టణంలోని కోళ్ల వ్యర్థాలు, సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలు, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ వ్యర్థాలను శివారు ప్రాంతమైన కొత్త బైపాస్ రోడ్డు, మల్లాయిపాలెం రైల్వే గేటు వరకు రహదారి వెంబడి డంప్ చేస్తున్నారు. దీంతో దోమలు విపరీతంగా పెరుగుతున్నాయి. దీనికి తోడు మున్సిపల్ పారిశుధ్య సిబ్బందే చెత్తను తగులబెడుతుండటంతో కాలుతున్న కోళ్ల వ్యర్థాలు, సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాల వల్ల భరించలేని దుర్గంధం వెదజల్లుతోంది. ఈ రహదారుల గుండానే ప్రధానంగా పాఠశాలలకు విద్యార్థులు వెళ్ళుతుంటారు. గతంలో పట్టణవాసులు ఈ రహదారిపైనే మార్నింగ్ వాక్ చేసేవారు. దుర్వాసనను భరించలేక పట్టణంలోని ప్రధాన రహదారుల్లో నడకసాగిస్తున్నారు.

ఇప్పటికే పట్టణంలో వైరల్ జ్వరాలతో ప్రజలు మంచాన పడ్డారు. పారిశుధ్య నిర్వహణలో జరుగుతున్న నిర్లక్ష్యమే దీనికి నిదర్శనం. చిన్న పిల్లలు, వృద్ధులు ఎక్కువగా అస్వస్థతకు గురవుతున్నారు. ప్రభుత్వాసుపత్రి నుంచి ప్రైవేట్ ఆసుపత్రి వరకు రోగులతో కిటకిటలాడుతున్నాయి. అస్తవ్యస్త పారిశుధ్యంతోనే జ్వరాలు ప్రబలుతున్నాయన్నాయి.


రహదారి వెంబడి వేసిన చెత్తా, చెదారం


గుట్టలుగా పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు


చోరీ జరిగిన దుకాణాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ ఎస్సై సత్యకళ

రూ. 2లక్షల విలువగల మినుముల చోరీ

పామర్రు,ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): పామర్రులోని చల్లపల్లి రోడ్డులో గల ఓ అపరాలు వ్యాపారి దుకాణంలో చోరీ జరిగింది. సంబంధిత దుకాణ యాజమాని ఊటుకూరి వీర వెంకట సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు దుకాణం తాళాలు పగలు గొట్టి లోపలికి ప్రవేశించి, లోపలగల పోట్లుతీసిన మినుములు(తెల్ల గుళ్ల) 25కేజీలవి 40కట్టలను దొంగిలించుకుని పోయారన్నారు. వాటి విలువ రూ.రెండులక్షల ఉందన్నారు. సోమవారం తాను దుకాణం తెరిచేందుకు వెళ్లిన సమయంలో చోరీ జరిగినట్లు గుర్తించి ఆమేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ట్రైనీ ఎస్సై సత్యకళ తన సిబ్బందితో వచ్చి దొంగతనం జరిగిన దుకాణాన్ని, సమీపంలోగల సీసీ కెమెరాల ఫుటేజీను పరిశీలించారు. ఎప్పుడు జనంతో రద్దీగా ఉండే చల్లపల్లి రోడ్డులో ఈ దొంగతనం స్థానికుల్లో సంచలనం కలిగించింది.

రాజకీయ ఉనికి కోసం కైలే అర్ధరహిత ఆరోపణలు

- ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు,ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో రైతాంగాన్ని అవసరమైన యూరియా, కాంప్లెక్సు ఎరువులు అందుబాటులో ఉన్నప్పటికీ వైసీపీ మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ రైతు సమస్యలపై అర్ధరహితమైన ఆరోపణలు కూటమి ప్రభుత్వంపై చేయడం హస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసీపీ హయంలో జరిగిన అవీనీతి దందాను తమ ప్రభుత్వంపై రుద్దడం సరికాదని అనిల్ గ్రహిస్తే మంచిదని హితువు పలికారు. ఎన్నికల అఫిడవిడ్‌లో అనిల్‌పేరుమీద భూములున్నాయని తెలిపి నేడు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పామర్రులో లబ్ధిదారుడిగా అర్హత పొందినట్లు తాను ప్రభుత్వ అడంగాళ్, మీపోర్టల్ ద్వారా ఇచ్చిన ఆధారాలతో మాట్లాడితే తనకు సెంటు భూమిలేదని ఆయన మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

తమ ప్రభుత్వం అధికారంలో రాగానే సామాన్యుడికి ఇసుక అందించేందుకు అనేక సంస్కరణలతో ముందుకు సాగుతూ అందరికి ఇసుకను అందించనున్నామన్నారు. ఇప్పటి వరకు ఐదుమండలాల రైతులకు అవసరార్థం 3వేల447 మేట్రిక్ టన్నుల యూరియా, కాంప్లెక్సు ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. ఈసమావేశంలో మండల టీడీపీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, మంతెన రామంజనేయులు, మూడేశంకర్, చాట్లరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏకపక్ష వైఖరిని విడనాడాలి

- కేఎస్ రావు, జేఎల్ఎన్‌వీకే మూర్తి

గుడివాడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ ఆర్టీసీ డిపో మేనేజర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, ఉద్యోగులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు కె.ఎస్ రావు, జె.ఎల్.ఎన్.వి.కె మూర్తి, కె.వి సుబ్బారావు, కె.ఎ సాయి, ఎస్ఎల్ రావులు ఆరోపించారు. గుడివాడ ఆర్టీసీ డిపో మేనేజర్ ఏకపక్ష వైఖరి, కక్ష సాధింపు చర్యలకు నిరసనగా సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదురుగా ఏపీపీటీడీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఎంప్లాయిస్, నేషనల్ మజ్దూర్ యూనియన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడీసీలను తగ్గించి పనిభారాన్ని తగ్గించాలన్నారు. అక్రమ చార్జ్‌షీట్లు, పనిష్మెంట్లు రద్దు చేయాలన్నారు. పల్లెవెలుగు బస్సులకు మిడిల్, సింగిల్ డోర్ ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యోగులకు సుస్తి చేసిన కాలానికి వేతనం చెల్లించాలని, బస్సుల కండీషన్ మెరుగుపరచాలన్నారు. గ్యారేజీ కార్మికులకు అవరసమైన సామగ్రి, టూల్స్ స్పేర్ పార్టులు అందించాలన్నారు. ఇంద్ర ఏసీ బస్సుల్లో పై నుంచి కారుతున్న వర్షపు నీటిని అరికట్టేలా బస్సుల టాప్‌లను బాగు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా డిపో మేనేజర్ చూడాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ దీక్షల్లో బాలాజీ, సోములు, ఎ.జె.వి కుమార్, జె.శ్రీధర్ పాల్గొన్నారు.


దీక్షలో పాల్గొన్న ఈయూ, ఎన్ఎంయూ నాయకులు

క్రమ శిక్షణతో కూడిన విద్య అవసరం

- ప్రిన్సిపాల్ డాక్టర్ కరుణకుమార్

గుడ్లవల్లేరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల (ఎస్ఆర్‌జీఈసి) లో 2025-26 విద్యాసంవత్సర మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ లో చేరిన విద్యార్థులకు జీరో సెమిస్టర్ తరగతులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తల్లితండ్రుల,విద్యార్థుల సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్ మాట్లాడుతూ 27 సంవత్సరముల సుదీర్ఘ అనుభవం కలిగి విద్యార్థుల ఉజ్వల భవిషత్తుకు క్రమ శిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్న తమ కళాశాలను ఎంచుకొన్న విద్యార్థులకు, వారి తల్లితండ్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం నుంచి ఆగస్టు 14 వరకూ నిర్వహించే ఇండక్షన్ ప్రోగ్రామ్ను పొందుపరిచామని ఆయన తెలిపారు. ఏఐసీటీఈ నిబంధనలను అనుసరిచి ఈ జీరో సెమిస్టర్‌ను రూపొందించామన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పి.సిద్ధయ్య, యాజమాన్య సలహాదారు డాక్టర్ పి.రవీంద్రబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోదండరామారావు, డాక్టర్ ఎం.ఆర్.సిహెచ్ శాస్త్రి, డైరెక్టర్లు డాక్టర్ జి.వి.ఎస్.ఎన్.ఆర్.వి ప్రసాద్, డాక్టర్ ఎం.కామరాజు, ఎస్‌పీఐ -25 కో-ఆర్డినేటర్ ఎల్.ఆర్.శ్రీనివాస్, డాక్టర్ ఎస్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కరుణ కుమార్

నిరక్షరాస్యతా శాతం తగ్గించడమే లక్ష్యం

- ఎంపీడీవో విమాదేవి

పెదపారుపూడి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లను గుర్తించి వారికి ఈ నెల 6న శిక్షణ ఇవ్వటం జరుగుతుందని ఎంపీడీవో విమాదేవి పేర్కొన్నారు. అక్షర ఆంధ్ర రెండవ ఫేజ్ కింద ఉల్లాస్ కార్యక్రమం ఈ నెల 7వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించనున్న నేపథ్యంలో మండల స్థాయి కమిటీ సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో మొత్తం 4303 మంది వయోజనులు నిరక్షరాసులుగా ఉన్నారని, మూడు దశలలో ఈ కార్యక్రమం కింద వారిని అక్షరాస్యుల్ని చేయటం జరుగుతుందని, మొదటి దశలో 1300 మందికి 130 మంది వాలటీర్లతో ప్రతీ రోజూ కోర్సు నేర్పటం జరుగుతుందన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విమాదేవి

ముందు వాలంటీర్లుగా వెలుగు మహిళల నుంచి 90 మంది, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు, శ్రామికుల నుంచి 40 మంది గుర్తించి శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడివో వంగా శ్రీనివాస్, ఎంఈవో బొడ్డు శ్రీనివాస్, ఏపీఎం మహంకాళిరావు, ఉపాధి టీఏ రంగారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల విస్తృత తనిఖీలు

గుడివాడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో సోమవారం ట్రాఫిక్ పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 15 మంది మైనర్‌లను అదుపులోకి తీసుకుని ఒక్కొక్కరికి రూ.500లు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్సై పూడి నాగరాజు తెలిపారు. మైనర్‌ల తల్లిదండ్రులను పిలిపించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. 18ఏళ్ల లోపు మైనర్‌లకు వాహనాలను ఇస్తే ఉపేక్షించేది లేదని, తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై నాగరాజు హెచ్చరించారు.

సాగునీరు అందించటమే లక్ష్యం

పెదపారుపూడి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఎకరాకూ పంటకాలువల ద్వారా సాగునీరు అందించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పెదపారుపూడి సాగునీటి సంఘం అధ్యక్షుడు కాగిత లక్ష్మీనారాయణ అన్నారు. ఈ విషయమై ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతు సంక్షేమమే ధ్యేయంగా మండలంలో సాగునీటి సంఘాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా పైనుంచి వచ్చే నీరు ప్రతీ ఎకరాకు అందేవిధంగా పంట కాలువలతో సహా పిల్ల కాలువలలో పూడికతీయించామని తెలిపారు.

రహదారులపై వాహనాలను పార్కింగ్ చేయొద్దు

గుడివాడ రూరల్: లారీ యజమానులు, డ్రైవర్లు ఆటో నగర్, పెద్ద కాలువ సెంటర్, బొమ్ములూరు రహదారులపై తమ లారీలు పార్కింగ్ చేయవద్దని రూరల్ ఎస్సై చంటిబాబు అన్నారు. సోమవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో లారీ యజమానులతో సమావేశం నిర్వహించారు. ప్రతి లారీ ఓనర్ లారీలను బొమ్ములూరు లారీ స్టాండ్‌లో ఉంచుకోవాలని తెలిపారు. ప్రధాన రహదారులపై లారీలు ఉంచిన వారిపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పోలీసు సిబ్బంది, లారీ యజమానులు పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయాలి

పెదపారుపూడి: విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు, పామర్రు డివిజన్ కార్యదర్శి ఓ.గంగాధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 7వ తేదీన జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. పెదపారుపూడిలో వారు మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ట్రాన్స్‌కో, జెన్‌కో డిస్కములలో షిఫ్ట్ ఆపరేటర్లుగా, స్టోర్ హమాలీస్, మీటర్ రీడర్లు, గ్యాంగ్ మెన్‌గా రకరకాల బాధ్యతలు నిర్వహిస్తున్న వారి సమస్యలను పట్టించుకోకపోవటంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కనీస విలువ లేకుండా పనిలో యాక్సిడెంట్ అయితే సరైన వైద్య సదుపాయం కూడా జరగని పరిస్థితి నెలకొందని, అనేక మంది పిట్టలు రాలిపోతున్నట్లు రాలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

- రూ.3600 నగదు స్వాధీనం

గుడివాడ రూరల్ : లింగవరం గ్రామశివారు ప్రాంతంలో ఆదివారం అర్ధరాత్రి పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3600ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు గుడివాడ తాలుకా ఎస్సై ఎస్.చంటిబాబు తెలిపారు. అనంతరం కేసునమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మీకోసం అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తా

- మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్

గుడివాడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మీకోసంలో వస్తున్న అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మీ కోసంలో 8అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ ఇంజినీర్ ఎ.ఎస్.ఎన్ ప్రసాద్, అకౌంట్స్ అధికారి జి.టి నాయుడు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఏసుబాబు, మేనేజర్ నిర్మలకుమారి, సీఎంఎం బసవేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ రూరల్: తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన దరఖాస్తులు పరిశీలించి పరిష్కారం చూపుతున్నట్టు తహసీల్దార్ కిరణ్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో మీ కోసం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌటపల్లిలో తమ భూమి తక్కువగా ఉందని, తాము కొలతలు కొలిచి అప్పగించాలని కోరుతూ ఒకరు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విషయాన్ని ఆ వీఆర్వోకు సమాచారం అందించి సర్వేయర్‌కు తెలియజేశామన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించటానికి ఆయా శాఖల అధికారులకు పంపుతున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో బోలెం అనంతలక్ష్మి పాల్గొన్నారు


సమావేశంలో ప్రసంగిస్తున్న తహసీల్దార్ కిరణ్

విఘ్నేశ్వరస్వామి ఆలయానికి విరాళం

గుడివాడ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి) : స్థానిక మెయిన్‌రోడ్డులో వేంచేసియున్న విఘ్నేశ్వరస్వామి దేవస్థానంపై భాగాన ఏర్పాటు చేస్తున్న దేవతామూర్తుల విగ్రహాలను చెక్కించడానికి సోమవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని శ్రీలక్ష్మీ చరణ్ పబ్లిక్ స్కూల్ అధినేతలు గండెం నాగేశ్వరరావు, వెంకటలక్ష్మీ దంపతులు రూ.10,116లు ఆలయ కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు(వాసు)కు అందించారు. దేవస్థాన అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాశాశ్రమంలో గోవులకు దాణా

గుడివాడ : స్థానిక ప్రణవాశ్రమంలోని గాయత్రి గోశాల గోవులకు రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ పూర్వ అధ్యక్షుడు యలమంచిలి రెడ్డియ్య చౌదరి మనుమరాలు ఆర్విత్ శ్రీరామ్ పేరున రూ.30వేలు విలువగల 36 బస్తాల పశువుల దాణాను సోమవారం గోశాల వ్యవస్థాపకుడు కె.డి.వి.ఎన్ శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు యలమంచిలి నాగేశ్వరరావు, గుళ్లపల్లి కిరణ్‌బాబు, అసిస్టెంట్ గవర్నర్ ముళ్లపూడి రమణమూర్తి, పూర్వ అధ్యక్షుడు యలమంచిలి లక్ష్మీ, నర్మద, పి.చంద్రశేఖర్, ఎ.సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యం

- ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ప్రసన్న విశ్వనాథ్


కూచిపూడిలో..

కూచిపూడి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలు అమృతంతో సమానమని, తల్లిపాలు తాగించటం తల్లిబిడ్డల ఆరోగ్యానికి మేలు కలిగిస్తుందని మొవ్వ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి ప్రసన్న విశ్వనాథ్ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవ కార్యక్రమాల్లో భాగంగా నిడుమోలు సెక్టార్ పరిధిలోని మూడు కేంద్రాలు, కూచిపూడి సెక్టార్ పరిధిలోని భట్లపెనుమర్రులోని నాలుగు అంగన్వాడీ కేంద్రాల్లో తల్లులకు, గర్భిణులకు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతీ, సూపర్‌వైజర్లు రత్నమాల, ఏఎస్.కళ్యాణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


పమిడిముక్కలలో..

పమిడిముక్కల : పిల్లలు ఆరోగ్యంగా ఎదిగేందుకు తల్లి ముర్రుపాలు ఎంతో ఉపయోగపడతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి. ఉష అన్నారు. తల్లిపాల వారోత్సవాలు పురస్కరించుకుని పమిడిముక్కల అంగన్వాడీ కేంద్రం -3లో సోమవారం తల్లులు, గర్భిణుల అవగాహన కార్యక్రమంలో పాల్గొని తల్లిపాల విశిష్టత తెలియజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీబీ సరోజిని తదితరులు పాల్గొన్నారు.

పెదపారుపూడి: అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టడం వల్ల పోషక విలువలు అధికంగా తల్లి నుంచి బిడ్డకుఅందుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.శివనాగమణి అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ 5వ అంగన్వాడీ కేంద్రంలో సర్పంచ్ అప్పికట్ల ఆశాజ్యోతి అధ్యక్షతన సమావేశం జరిగింది. అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, పాల్గొన్నారు.


పెదపారుపూడిలో..

తోట్లవల్లూరు : తల్లిపాలే బిడ్డకు సంపూర్ణమైన ఆరోగ్యాన్నిస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె. నాగలక్ష్మీ అన్నారు. మండలంలోని పెనమకూరు-3 అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా సోమవారం తల్లిపాలపై తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మరీదు శివ మధుబాబు, హెల్త్ సూపర్‌వైజర్ అనిల్ కుమార్, ఏఎన్ఎం బిఎల్ ప్రసన్న, పాల్గొన్నారు.


తోట్లవల్లూరులో..

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

నిత్యాన్నదానానికి రూ.5 లక్షల విరాళం



మోపిదేవి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవిలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి పెనమలూరు మండలం పోరంకి గ్రామానికి చెందిన పోతార్లంక దేవకీ నందన ప్రసాద్ - శివకుమారి దంపతులు రూ.5 లక్షల విరాళం అందజేశారు. ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు చెక్కును సోమవారం అందించారు. ఈ సందర్భంగా దాతలను ఘనంగా సత్కరించారు.



డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజుకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేస్తున్న ఈవో శ్రీరామ వరప్రసాదరావు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో డిప్యూటీ స్పీకర్

మోపిదేవి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు సోమవారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన రఘురామ కృష్ణరాజుకు ఆలయ అధికారులు, అర్చక స్వాములు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజ లు చేశారు. రఘురామ కృష్ణరాజుకి పట్టు వస్త్రాలు, స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని వేదపండితులు, ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు అందజేశారు.



చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్, కొల్లు రవీంద్ర ఫ్లెక్సీకి పాలాభిషేకం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకంతో రైతు మోములో ఆనందం వెల్లివిరిసిందని మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొల్లూరి సురేష్ పేర్కొన్నారు. బందరు మండలం ఎస్.ఎన్.గొల్లపాలెంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి చిత్రాలతో కూడిన ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా దళిత రైతులకు ఎటువంటి సహకారం లేదని, నేడు కూటమి ప్రభు త్వం అన్నదాత సుఖీభవ ఇవ్వడం ద్వారా తమ కల నెరవేరిందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.



రైతులకు వేరుశెనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచే నాని, గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచే వెంకటదుర్గా ప్రసాద్ (నాని) పేర్కొన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాల మేరకు సోమవారం బందరు మండలం గోకవరం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 750 క్వింటాళ్ల వేరుశెనగ విత్తనాలను 12 గ్రామాల రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు మనోహర్ మాట్లాడుతూ, మేలైన విత్తనాల పంపిణీతో అధిక దిగుబడులు వస్తాయన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, టీడీపీ తెలుగు రైతు కృష్ణాజిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకుడు లంకే శేషగిరి, వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు.




కరుణశ్రీ పాపయ్యశాస్త్రికి ఘననివాళి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):కరుణ రసంపై కవితలు రాసి జంధ్యాల పాపయ్యశాస్త్రి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని సిరికవి డాక్టర్ చింతలపాటి మురళీకృష్ణ అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్టార్ స్కూల్‌లో జంధ్యాల పాపయ్య శాస్త్రి జయంతిని ఘనంగా నిర్వహించారు. పాపయ్యశాస్త్రి చిత్రపటానికి సాహితీ ప్రియులు నివాళులర్పించారు. చింతలపాటి మురళీకృష్ణ పాపయ్యశాస్త్రి రచించిన కరుణశ్రీ, విజయశ్రీ, ఖండ కావ్యాలలోని పద్యాలను మృదుమధురంగా వినిపించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మచిలీపట్నం శాఖ అధ్యక్షుడు జి. కిషోర్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మానవత జిల్లా ఉపాధ్యక్షుడు, స్టార్ విద్యా సంస్థల మెంటార్ పి. శ్రీరామ్, మానవత మచిలీపట్నం శాఖ జాయింట్ సెక్రటరీ పి.వి.ఫణికుమార్, ప్రిన్సిపాల్ గౌసియా తదితరులు పాల్గొన్నారు. చింతలపాటి మురళీకృష్ణను ఘనంగా సన్మానించారు.

వరి, మినుములో సమగ్ర యాజమాన్యంపై శిక్షణ

ఘంటసాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం, విజయవాడ కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఘంటసాలలో వరి, మినుము పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రెండు రోజులపాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి మాట్లాడుతూ సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధ్యమన్నారు. కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ మనోజ్ గోస్వామి, సస్యరక్షణాధికారి చౌదరి, ఏడీఏ శ్యామల, సహాయ సస్యరక్షణ అధికారి ప్రేమ రంజిత, శాస్త్రవేత్తలు రేవతి, వెంకటలక్ష్మి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పైడమ్మ తల్లికి ఎమ్మెల్యే కాగిత పూజలు



గూడూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : కప్పలదొడ్డి గ్రామంలోని పైడమ్మ తల్లికి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సోమవారం ప్ర త్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. డీసీ చైర్మన్ పోతన స్వామి, ఆకులమన్నాడు పీఏసీఎస్ చైర్మన్ ఎజ్జు శివాజీ, మాజీ సర్పంచ్ కట్టా మునేశ్వరరావు, గోపీ నాగబాబు, ఎన్ఏ బేగ్, కొఠారి ఫణికుమార్, సాయికిరణ్, వాసన వెంకటేశ్వరరావు, సుంకర అంజిబాబు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు



పులిగడ్డ టోల్‌ప్లాజా, నాగాయలంక, కోడూరులో మండలి వెంకట కృష్ణారావు విగ్రహాలకు నివాళులర్పిస్తున్న దివిసీమ నాయకులు

ఎంవీకే సేవలు స్ఫూర్తిదాయకం

అవనిగడ్డ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : దివిసీమ గాంధీ మండలి వెంకట కృష్ణారావు (ఎంవీకే) సేవలు స్ఫూర్తిదాయకమని అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు అన్నారు. మండలి వెంకట కృష్ణారావు శతజయంతి సందర్భంగా గాంధీక్షేత్రంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అవనిగడ్డ, మోపిదేవి సబ్ బ్రాంచ్‌ల ఆధ్వర్యంలో సోమవారం మెగా రక్తదాన శిబిరం జరిగింది. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌లతో కలిసి మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఎస్వీఎల్ కళాశాల, ఏవీఆర్.కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, మోపిదేవి దేవాలయ ఉద్యోగులు, పోలీసు అధికారులు, మహిళలు, యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు, ఎస్సై ప్రతాపరెడ్డి, చాణక్య, ఏఎంసీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు, డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్ తదితరులు రక్తదానం చేసినవారిలో ఉన్నారు. అవనిగడ్డ, మోపిదేవి సబ్ బ్రాంచ్ చైర్మన్లు గుడివాక శేషుబాబు, యర్రంశెట్టి సుబ్బారావు పర్యవేక్షణలో జరిగిన శిబిరంలో చిలకలపూడి పాపారావు, మండలి వెంకట్రామ్ - సాయిసుప్రియ, శీలం అశ్విన్‌కుమార్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ టిఎస్ఎస్.బాలాజీ, కార్యదర్శి భవిరి శంకరనాథ్, కోశాధికారి కొండపల్లి రాంబాలాజీ, జిల్లా ఉపాధ్యక్షుడు వంగర శేషగిరిరావు, సబ్‌బ్రాంచ్ చైర్మన్లు భోగాది శివవిష్ణువర్ధన్, బెల్లంకొండ వెంకటేశ్వరరావు, నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, ప్రముఖ యాసం చిట్టిబాబు, రాజనాల వీరబాబు, దుట్టా ఉమామహేశ్వరరావు, బండే రాఘవ, రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ హరికృష్ణ, డాక్టర్ హనుమంతయ్య, రెడ్‌క్రాస్ ప్రతినిధులు కొండవీటి ఈశ్వరరావు, ఆర్.సుబ్రహ్మణ్యం, హరిప్రసాద్ సహకారం అందించారు.

230 మందికి ఉచిత వైద్యపరీక్షలు

మండలి వెంకట కృష్ణారావు శతజయంతి సందర్భంగా అవనిగడ్డ గాంధీక్షేత్రంలో సోమవారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యశిబిరాన్ని ఏపీ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మహిళా కమీషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి ప్రారంభించారు. విజయవాడ బెస్ట్ సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్ వైద్య బృందం 230 మందికి వైద్యపరీక్షలు చేశారు. ఎముకల వైద్యులు డాక్టర్ సంతోష్‌కృష్ణ, డాక్టర్ కె.పవన్‌కుమార్ యాదవ్, నెఫ్రాలజీ నిపుణులు డాక్టర్ గోళ్ల అన్వేష్, పల్మనాలజీ వైద్యులు డాక్టర్ బొల్లు తేజ, గైనకాలజిస్ట్ డాక్టర్ చదలవాడ అనుకృష్ణ, జనరల్ ఫిజిషియన్లు డాక్టర్ చరిష్మా, డాక్టర్ నవీన్ వైద్యసేవలు అందించారు. ఆసుపత్రి సిబ్బంది సహకరించారు.

దివిసీమలో ఎంవీకేకు ఘననివాళి

అవనిగడ్డ రూరల్ : పులిగడ్డ టోల్ ప్లాజా మండలి వెంకట కృష్ణారావు కాంస్య విగ్రహానికి ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, శీలం అశ్విన్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలి రామ్మోహనరావు, మండలి వెంకటేశ్వరరావు, మండలి శేషు, మండలి బలరాం, మండలి రామకోటేశ్వరరావు, మండలి దేవ సుధీర్, అభిమానులు పాల్గొన్నారు. అలాగే పులిగడ్డ ఇరిగేషన్ కార్యాలయం సమీపంలోని విగ్రహాలకు, అనంతరం పులిగడ్డ వద్ద గల మండలి వెంకట కృష్ణారావు - ప్రభావతి దేవిల సమాధుల వద్ద నివాళులర్పించారు. టోల్ ప్లాజా వద్ద మండలి వెంకట కృష్ణారావు కాంస్య విగ్రహానికి కాంగ్రెస్ నేతలు ఆది రామ్మోహనరావు, మీర్ రిజ్వాన్, కొండేటి భాస్కరరావు, జక్కవరపు బాబురావు, సయ్యద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి** : జనసేన కార్యాలయంలో మండలి కృష్ణారావు శతజయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, టీడీపీ నేత రావి రాజేశ్వరరావు, జనసేన నేతలు బొందలపాటి వీరబాబు, అడపా రవి తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు. **నాగాయలంక** : దివిసీమ గాంధీ మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాలను భావదేవరపల్లి, నాగాయలంక, నంగేగడ్డ, తలగడదీవి గ్రామాల్లోని మండలి వెంకట కృష్ణారావు విగ్రహాల వద్ద కూటమి నేతలు, అభిమానులు నిర్వహించారు. దివిసీమకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగమల్లిఖార్జునరావు, టీడీపీ మండల అధ్యక్షులు మెండు లక్ష్మణరావు, తెలుగు మహిళ అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, మండలి ఉదయభాస్కర్, తలశిల వెంకట నరసింహారావు, చిట్టా వీర అన్నపూర్ణయ్య, అంబటి శ్యామ్, వర్రే రాంబాబు, ఉప్పల ప్రసాద్ పాల్గొన్నారు. **కోడూరు** : కోడూరు ప్రధాన సెంటర్‌లో మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి తూర్పుకృష్ణా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు ఘన నివాళులర్పించారు. రామకృష్ణాపురం గ్రామం లో మండలి వెంకట్రామ్ చేతులమీదుగా నిరుపేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. మర్రె గంగయ్య, కొండవీటి సునీత, కోట రాంబాబు, అద్దంకి పాండురంగారావు, కాగిత రామారావు, గొరిపర్తి శ్రీనివాసరావు, బడే భావన్నారాయణ, పూతబోయిన సీతారత్న సాయిబాబు, తోట సోమశేఖర్, తోట అశోక్ పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

చల్లపల్లి : మండలి వెంకట కృష్ణారావు శతజయంతి సందర్భంగా టీడీపీ సీనియర్ నేత యార్లగడ్డ శ్రీనివాసరావు వితరణతో సీయోను వృద్ధాశ్రమంలో అన్నదానం జరిగింది. మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు, సర్పంచ్ కృష్ణకుమారి, డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు పైడిపాముల స్వప్న, ఏఎంసీ డైరెక్టర్ నాదెళ్ల వెంకట నరసయ్య, మోర్ల శివ, షేక్ నబీషెరీ, తాతా ప్రదీప్, గుత్తికొండ వంశీకృష్ణ, బి.కనకదుర్గ, పఠాన్ జిలానీ, ఆశ్రమ నిర్వాహకులు శీలం భాస్కరరావు పాల్గొన్నారు.

చిన్నారులకు వస్త్రాల పంపిణీ

ఘంటసాల : ఎంవీకే శతజయంతి వేడుకలు శ్రీకాకుళం గ్రామంలో తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు పరుచూరి సుభాష్ చంద్రబోస్ తదితరులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. శ్రీకాకుళం, శీలంవారిపాలెం, సూరపనేనివారిపాలెం, పాపవినాశనం, గోగినేనిపాలెం, అచ్చెంపాలెం, తెలుగురావుపాలెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని 100 మంది చిన్నారులకు రూ.40 వేల విలువ గల వస్త్రాలను పంపిణీ చేశారు. ఘంటసాల ఏఎంసీ వైస్ చైర్మన్ అత్తలూరి గోపీచంద్, అచ్చెంపాలెం సర్పంచ్ గాజుల శ్రీనివాసరావు, టీడీపీ నేతలు కుంపటి చిట్టిబాబు, శీలం శ్రీనివాస్, ఆరుంబాక రవి, పాడిబండ్ల నరేష్, దాసం రామకృష్ణ, కొండవీటి నాని, తాడికొండ సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి లయన్స్ అధ్యక్షునిగా ముమ్మనేని నాని



లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ముమ్మనేని నానిని సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

చల్లపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : సేవా కార్యక్రమాల నిర్వహణలో చల్లపల్లి లయన్స్ క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకమని లయన్స్ జిల్లా గవర్నర్ వి.వి.పి.ఎస్.ఆంజనేయులు, పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ దామెర్ల శ్రీశాంతి అన్నారు. చల్లపల్లి లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం శారదా గ్రాండియర్ ఫంక్షన్ హాలులో అట్టహాసంగా జరిగింది. క్లబ్ అధ్యక్షునిగా ఉపసర్పంచ్ ముమ్మనేని నాని బాధ్యతలు స్వీకరించగా, కార్యదర్శిగా వరదా హరిగోపాల్, కోశాధికారిగా నర్రా సాయిబాబులు ప్రమాణం చేశారు. అతిథులు మాట్లాడుతూ, ఉపసర్పంచ్‌గా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసే ముమ్మనేని నాని లయన్స్‌క్లబ్ అధ్యక్షునిగా ఎన్నిక కావటం అభినందనీయమన్నారు. జిల్లాలో బెస్ట్ ప్రెసిడెంట్‌గా సేవలు అందించాలని ఆకాంక్షించారు. చల్లపల్లి లయన్స్‌క్లబ్ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన నాని మాట్లాడుతూ, సభ్యుల సహకారంతో అందరూ మెచ్చే రీతిలో, ఆదర్శవంతంగా సేవలందిస్తానని హామీఇచ్చారు. లయన్స్ జిల్లా ప్రతినిధులు సిహెచ్.శ్రీనివాసరెడ్డి, మద్దినేని చక్రధర్, కొర్రకూటి శ్యామ్‌ప్రసాద్, డాక్టర్ యర్రంరెడ్డి గాంధీ, డాక్టర్ యక్కటి సుధాకర్‌బాబు, జడ్‌సీ మోపిదేవి వెంకటేశ్వరరావు, ఎన్‌సీహెచ్.రాజేశ్వరరావు, ముత్యప్రసాద్, గత అధ్యక్ష కార్యదర్శులు రాయపాటి రాధాకృష్ణ, కస్తూరి ప్రసాద్, ఐవీఎం డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్, పారిశ్రామికవేత్తలు గడ్డిపాటి శ్రీనివాసరావు, కోనేరు మారుతీప్రసాద్, చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు, ఎస్సై పివి ఎవి.సుబ్రహ్మణ్యం, ప్రముఖులు వీరమాచనేని భవానీప్రసాద్, డీసీ చైర్మన్లు నిడమానూరి దిలీప్ కుమార్, అయినపూడి భానుప్రకాష్, ఏఎంసీ చైర్‌పర్సన్‌లు తోట కనక దుర్గ, దోనేపూడి శివరామయ్య, ఎంపీటీసీ సభ్యులు మాలెంపాటి శ్రీనివాసరావు, పైడిపాముల స్వప్న, ఎల్ఐసీ బీఎం ఆకుల హరిప్రసాద్, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు ఎస్.జి. ఎ.బాషా, టి.సాంబశివరావు, ఏఎల్ఆర్‌కె.ప్రసాద్, జలంధర్‌కుమా ర్, ఉప్పల సాంబశివరావు పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు, ప్రముఖులు అధ్యక్షుడిగా ఎన్నికైన ముమ్మనేని నానిని పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. పెదకళ్లేపల్లి లయన్స్‌క్లబ్ శాఖను కూడా ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా గొర్రెపాటి రమేష్ చంద్ర ఎన్నిక కాగా, ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించి బాధ్యతలు అప్పగించారు. నూతన కార్యవర్గాన్ని గవర్నర్ ప్రకటించారు.

ప్రమాదవశాత్తు కిందపడి పెయింటర్ మృతి



మచిలీపట్నం క్రైమ్, అగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : భవనానికి రంగులు వేస్తూ ప్రమాదవశాత్తు జారిపడి పెయింటర్ మృతి చెందిన సంఘటన కేడీసీసీ బ్యాంకు సమీపంలో జరిగింది. గూడూరు మండలం కప్పలదొడ్డికి చెందిన పెయింటర్ వెంకట స్వామి బందరు నగరంలోని కేడీసీసీ బ్యాంకు సమీపంలోని భవనానికి తాడు సాయంతో రంగులు వేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. రాబర్ట్‌సన్ పేట పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వామిత్వ పథకంతో భూ సమస్యలకు పరిష్కారం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : స్వామిత్వ పథకం ద్వారా భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. కానూరు గ్రామంలో సోమవారం స్వామిత్వ, ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టు ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు జరిగింది. గోపు సత్యనారాయణ మాట్లాడుతూ, మెరుగైన సాంకేతికతతో కూడిన సర్వే, మ్యాపింగ్ కోసం ఏర్పాటు చేసిన పథకమన్నారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, జనసేన నాయకుడు దివి మహేష్, చక్కా ఏడుకొండలు, బొమ్మిడి పెద ఏడుకొండలు, పీతా రాము, బొలిశెట్టి నాని, కొక్కిలిగడ్డ ప్రభుదాసు, గోపు వెంకటరమణ, మోపిదేవి కృష్ణ, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గంగానమ్మ విగ్రహ ప్రతిష్ఠ



మోపిదేవి, అగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మేళ్లమర్తిలంకలో యార్లగడ్డవారి ఇలవేల్పు గంగానమ్మ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. యార్లగడ్డ సోమశేఖర ప్రసాద్, యార్లగడ్డ అరవింద్ దంపతులు ప్రతిష్ఠించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘంటసాలపాలెంలో తల్లిపాల వారోత్సవాలు

ఘంటసాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాలపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. పుట్టిన బిడ్డకు మొదటి టీకా వేయించాలని, పుట్టిన అరగంట లోపే ముర్రుపాలు పట్టించాలని, ఆరు నెలల వరకు తల్లిపాలు బిడ్డకు అందజేయాలని తెలియజేశారు. ఏఎన్ఎం జ్యోతి, ఆశాకార్యకర్త కమల, మహిళా పోలీసు కె.నజరేయ కుమారి, కొత్తపల్లి, ఘంటసాలపాలెం అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంఈవో-1గా సనకా శ్రీకాంత్

నాగాయలంక, అగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండల విద్యాశాఖాధికారి-1గా సనకా శ్రీకాంత్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఇంతకాలం కోడూరు ఎంఈవో-1 టివి.ఎం.రామదాసు బాధ్యతలను నిర్వహించారు. సనకా శ్రీకాంత్ అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీడీ గా పని చేస్తూ ఎంఈవో-1 అదనపు బాధ్యతలను రామదాసు స్వీకరించారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

కోడూరు, అగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఇరాలి గ్రామంలో పిడుగుపాటుకు మృతి చెందిన గంజాల కొండాలమ్మ భౌతికకాయాన్ని మండలి వెంకట్రామ్ సందర్శించి నివాళులర్పించారు. ఆమె కుటుంబసభ్యులను పరామర్శించి మట్టి ఖర్చులకు సహాయం అందించారు. పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, అద్దంకి పాండురంగారావు, గంజాల సుందరరావు, స్థానిక పార్టీ నేతలు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

పెడన రూరల్, అగష్టు 4 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులను ప్రోత్సహిస్తే వారు ఉన్న చదువులు చదివి జీవితంలో మంచిగా స్థిరపడతారని మండల టీడీపీ ప్రధానకార్యదర్శి శీరం ప్రసాద్ అన్నారు. పల్లోటి స్కూల్‌లో పదోతరగతి చదువుతున్న ఆరేపల్లి కిషోర్‌కు ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

పంటల్లో సస్యరక్షణ పద్ధతులపై రైతులకు శిక్షణ

మోపిదేవి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరచిరువోలులంకలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు వరి పంటలో చేపట్టవలసిన సస్యరక్షణ పద్ధతులపైఅవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి కొక్కిలిగడ్డ హెప్సిబా రాణి మాట్లాడుతూ రైతులందరూ పంట నమోదు చేసుకోవాలని, కౌలు రైతులందరూ కౌలు కార్డులు తీసుకోవాలని, పసుపు, వరి పంటలకు బీమా చేయించుకోవాలని తెలిపారు. పసుపు పంటకు ఇన్సూరెన్స్ గడువు ఈ నెల 14వ తేదీ వరకు పొడిగించినట్లు తెలియజేశారు. ఏడీఏ డీఆర్‌సీ శ్రీనివాస్ మాట్లాడుతూ అధిక మోతాదులో ఎరువులు, పురుగు మందులు వాడటం సరికాదన్నారు. ఎంటీయూ 1318 వరి వంగడం తక్కువ మోతాదులో యూరియా స్వీకరిస్తుందని తెలియజేశారు. విఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పులిగడ్డలో సుపరిపాలనలో తొలి అడుగు

అవనిగడ్డ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమ మండల కన్వీనర్ కర్రా సుధాకర్ అన్నారు. పులిగడ్డలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ నేతలు పరుచూరి దుర్గాప్రసాద్, ఘంటసాల రాజమోహనరావు, అడపా శ్రీనివాసరావు, గుంటూరు వినయ్, మండలి రామ్మోహనరావు, చెన్ను బాబురావు, నాగిడి రాంబాబు, జటావత్ శ్రీను, నాగిడి శివనాగేశ్వరరావు, కొక్కిలిగడ్డ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత విలువలతో ఎదగాలి

పెడన రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు స్వల్ప కాల ఆనందాలవైపు ఆకర్షితులు కాకుండా దీర్ఘకాలిక ఆనందాల వైపు దృష్టి మరల్చాలని రామకృష్ణ మిషన్ (విజయవాడ)కు చెందిన చైతన్య అన్నారు. నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థుల పరిచయ వేదిక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని సందేశమిచ్చారు. విద్యార్థులు దురలవాట్లకు లోనుకాకుండా, విజ్ఞాన సముపార్జనకు కృషి చేయాలన్నారు. ఉన్నత విలువలతో ఎదగాలన్నారు. కరస్పాండెంట్ కాకి కుమార్‌బాబు, డైరక్టర్ దోసపాటి బాబా, ప్రిన్సిపల్ బీఆర్ఎస్ రెడ్డి, రమేష్, వద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేసరపల్లి గాంధీ మహంతి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంపై విచారణకు ఆదేశం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పాతికేళ్లుగా మూతపడిన కేసరపల్లి గాంధీ మహంతి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంపై విచారణ జరిపి పూర్తి నివేదికను సమర్పించాలని గన్నవరం సహకార శాఖ అసిస్టెంట్ రిజిష్ట్రార్ ఎండి మీరావలికి జిల్లా సహకార శాఖ అధికారి కె. చంద్రశేఖరరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. కేసరపల్లి గాంధీ మహంతి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం విషయమై చంద్రశేఖరరెడ్డి సోమవారం సమీక్షించారు. సహకార సంఘంలో అవినీతి అక్రమాలు జరిగిన నేపథ్యంలో 2000 నుంచి సహకార సంఘం కార్యకలాపాలు జరగడం లేదని, దీనిపై విచారణ జరపాలని సూచించారు. సహకార సంఘం సభ్యులతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయమై పంచాయతీ, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో నోటీసులు పెట్టాలన్నారు. గతంలో సెక్రటరీగా పనిచేసిన శ్రీనివాస్‌తో మాట్లాడి సహకార సంఘ పూర్వ సభ్యుల జాబితాలపై సమాచారం రాబట్టాలన్నారు.